MAHESH KUMAR KOVURY CELL:9885824338
STOOP
TAILORS&TEXTILES
SUITING,SHIRTING&READYMADES
MEN'S WEAR&KID'S WEAR
18-3-4,
BESIDE OLD POLICE STATION,,
CHATRINAKA

# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 సంచిక: 87, పేజీలు 12

ప్రజాప్రశ్న తెలుగు దినపత్రిక Connect us - @prajaprashna

శుక్ర వారం , జూన్ 14, 2023 వెల: 5 రూ/-

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam, Tirupati

## కాంగ్రెస్‌లో కర్ణాటక ఎన్నికల జోష్

- మధ్యప్రదేశ్‌లో అదే ఫార్ములా - ఐదు హామీలు ప్రకటించిన ప్రియాంక



భోపాల్ (ప్రశ్న న్యూస్) : మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ కీలక నేత ప్రియాంకాగాంధీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. జబల్ పూర్ లో నర్మదా నదికి పూజలను నిర్వహించిన అనంతరం, భారీ ర్యాలీతో ఆమె ప్రచారాన్ని ప్రారంభించారు. మరోవైపు ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ప్రచారంలో ఐదు హామీలతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీ కార్డ్ కన్నడ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ క్రమంలో మధ్యప్రదేశ్ లో సైతం ప్రియాంకాగాంధీ 5 గ్యారంటీలను ప్రకటించారు.- ప్రియాంక ప్రకటించిన 5 హామీలు,- రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 భృతి,- ప్రతి ఇంటికి రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్,-యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 100 నుంచి 200యూనిట్ల వరకు సగం ఛార్జీకే కరెంట్,- రైతు రుణాల మాఫీ - రాష్ట్రంలో పాత పెన్షన్ స్కీమ్ అమలు. ఈ 5 హామీలను ప్రకటించిన తర్వాత ప్రియాంక మాట్లాడుతూ.. నర్మదా మాత వద్దకు వచ్చామని, మేము అబద్ధాలు చెప్పమని అన్నారు. బీజేపీ వాళ్లు కూడా ఇక్కడకు వచ్చి హామీలు ఇస్తారని కానీ వాటిని నెరవేర్చరని చెప్పారు. డబుల్ ఇంజిన్, ట్రిపుల్ ఇంజిన్ గురించి వారు మాట్లాడతారని ఎద్దేవా చేశారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో కూడా వారు ఈ ఇంజిన్ల గురించి మాట్లాడారని, కానీ ఆ రాష్ట్రాల ప్రజలు బీజేపీని విశ్వసించలేదని అన్నారు. ఛత్తీస్ ఘడ్, హిమాచల్ ప్రదేశ్ లలో తాము ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామని ప్రియాంక చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలను చూస్తే అక్కడి పరిస్థితి ఎంత మెరుగ్గా ఉందో మీకు అర్థం అవుతుందని అన్నారు. మధ్యప్రదేశ్ లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇక్కడ జరగబోయే ఎంతో అభివృద్ధిని చూస్తారని చెప్పారు.

# కాంగ్రెస్, బీజేపీ నువ్వా నేనా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) : తెలంగాణలో రెండు జాతీయ పార్టీలు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. నిజమే కదా ఎన్నికల రేసు కోసం అనుకుంటే పొరపాటే ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంతర్గత కుమ్ములాట పోటీ పెట్టుకున్నట్లు కనిపిస్తున్నాయి కాంగ్రెస్, బీజేపీ. ఇన్నాళ్లు కాంగ్రెస్‌కే పరిమితమైన ఆ సంస్కృతి ఇటీవల బీజేపీకి పాకింది. వలస నేతలు, అసలైన బీజేపీ నేతల మధ్య పొసగడం లేదు. దీంతో బహిరంగంగానే వ్యాఖ్యలు చేయడం, ప్రెస్‌మీట్‌లు నిర్వహించడం కనిపిస్తోంది.

### సొంత పార్టీ నేతలపైనే పోరాటం

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని ఆ పార్టీ నేతలు చెబుతుంటారు. తమ పార్టీ విషయాలపై తాము మాట్లాడతామంటారు. కానీ, ఆ సాకుతో సొంత పార్టీ నేతలతోపాటు, అధిష్టానంపైనా విమర్శలు గుప్పిస్తుంటారు. తిరుగుబాటు కూడా చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇక గ్రూపు రాజకీయాలకే కొదవేలేదు. కాస్త పలుకుబడి ఉన్న ప్రతీ నాయకుడు కాంగ్రెస్‌లో గ్రూపులు మెయింటేన్ చేయడం కామన్. సమయం వచ్చినప్పుడు అధిష్టానం ముందు బల ప్రదర్శనకు దిగుతుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇతర పార్టీలపై పోరాడటం కన్నా వారిలో వారు పోరాడటానికే కాంగ్రెస్ నేతలకు ఎక్కువ సమయం కేటాయిస్తారు.

### కాంగ్రెస్ బాటలో బీజేపీ

బీజేపీ అంటే క్రమశిక్షణకు మారుపేరు. ఎన్నికల్లో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా పార్టీ కోసం నిబద్ధత కలిగిన నేతలు, కార్యకర్తలు ఉంటాన్న పేరు ఉంది. అయితే అదంతా టీ బీజేపీలో గతంలా మారింది. పరిస్థితి చూస్తుంటే రానురానూ కాంగ్రెస్‌లా మారిపోయేలా కనిపిస్తోంది. తాజాగా.. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఫాంహౌస్‌లో సొంత పార్టీ నేతలతో రహస్య భేటీ నిర్వహించడమే నిదర్శనం. విజయశాంతి, వివేక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నరసయ్య వంటి నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. అయితే ఈ సమావేశం ఎజెండా ఏమిటో ఎవరికీ తెలియదు.

### బీజేపీని వీడతారని ప్రచారం

కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీలో గ్రూపు రాజకీయాలు పెరిగాయి. నేతలు క్రమశిక్షణ గీత దాటుతున్నారు. బహిరంగ ప్రెస్‌మీట్‌లు, రహస్య భేటీలు నిర్వహిస్తున్నారు. స్టేట్ చీఫ్‌పైనే విమర్శలు చేస్తున్నారు. అధిష్టానం తీరునూ తప్పు పడుతున్నారు. దీంతో బీజేపీలో ఇమడలేని వలస నేతలు పార్టీనుంచి వెళ్లిపోతారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో జితేందర్‌రెడ్డి రహస్య భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భేటీలో పాల్గొన్న ఇద్దరు మాజీ ఎంపీలు పార్టీని వీడతారని ఇప్పటికే ప్రచారం జరుగుతోంది.

### బండి, ఈటల వర్గాలు

ఇక బీజేపీలో నేతలు బండి, ఈటల వర్గాలుగా విడిపోయినట్లు తెలుస్తోంది. పార్టీలో కొత్తగా చేరిన వారిలో కొంతమంది ఈటలవైపు ఉన్నారు. బండి సంజయ్ పదవీకాలం ముగిసినందున ఆయనను తప్పించాలని ఈటల వర్గం అధిష్టానాన్ని కోరుతోంది. ఈటలను టీబీజేపీ అధ్యక్షుడిని చేయాలని కోరుతోంది. వీరికి బీజేపీలోని బండి వ్యతిరేకవర్గం కూడా మద్దతు ఇస్తోంది. ఇక బండి వర్గం మాత్రం ఈటల వర్గం తీరును వ్యతిరేకిస్తోంది. ఈ విషయమై ఇరువర్గాల నేతలు కొంతమంది ఢిల్లీ వెళ్లి మరీ అధిష్టానం పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఈటలకు టీ బీజేపీ పగ్గాలు ఇస్తారని, బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారం మొదలైంది. మొత్తంగా అంతర్గత కుమ్ములాటలో కాంగ్రెస్‌ను అనుసరిస్తున్న బీజేపీ నేతలు ఇప్పుడు తెలంగాణలో అధికారం లోకి రావాలన్న ఆలోచన విరమించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పార్టీలో ఇమడలేని నేతలు త్వరలో కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ను ఓడించే పార్టీగా కాంగ్రెస్‌కు ఇమేజ్ మరింత పెరిగితే బీజేపీలోని వలస నేతలంతా వెళ్లిపోవడం ఖాయం.

## ఏపీలో ఎవరు ఎవరిని ట్రాప్ చేస్తున్నారు..?

- అంతుపట్టని పార్టీల స్కెచ్‌లు

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. టీడీపీకి శాశ్వతంగా తలుపులు మూసేసిన బీజేపీ ఇప్పుడు వాటిని తెరిచింది. వైకాపా అవినీతిమయం అంటూ ఆరోపిస్తోంది. బీజేపీ టీడీపీ ట్రాప్‌లో పడిపోయిందంటూ వైఎస్సార్సీపీ చెబుతోంది. నిజంగానే టీడీపీ ట్రాప్‌లో బీజేపీ ఉందా అసలు ఎవరి ట్రాప్‌లో ఎవరు పడుతున్నారు.? ఏపీలో శాంతిభద్రతలు అన్నవే లేవు వైకాపా ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్న మాటలు వరుసగా రెండు రోజుల్లో రెండు బహిరంగసభల్లో మారుమోగాయి. మామూలుగా ఈ మాటలు ఏ పార్టీ అన్నా అంటే వైఎస్సార్సీపీ నుంచి రియాక్షన్ మామూలుగా ఉండదు. కానీ ఈసారి మాత్రం తమలపాకుతో మీటినంత సుతారంగా స్పందించింది. ఎందుకంటే ఈ వ్యాఖ్యలు చేసింది బాసులకే బాస్ అమిత్ షా. జేపీ నడ్డా శ్రీకాళహస్తిలో విమర్శలు చేసినప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి మరీ పేర్ని నానీ లాంటి వాళ్లు స్పందించారు. కానీ అమిత్ షా నుంచి కూడా అవే మాటలు వచ్చే సరికి ఆచితూచి స్పందించింది వైఎస్సార్సీపీ. ముఖ్యమంత్రి కూడా మాకు బీజేపీ దూరమైందంటూ విక్టిమ్ కార్డు ప్లే చేశారు కానీ తనపై చేసిన ఆరోపణలకు మాత్రం సమాధానం ఇవ్వలేదు.

- బీజేపీలో భారీ మార్పునకు కారణం ఏంటి.?

అసలు బీజేపీ వ్యాఖ్యలకు ఇంత ప్రాధాన్యత ఎందుకు.? ఏ ప్రత్యర్థి పార్టీ అయినా సహజంగా చేసుకునే విమర్శలు లాంటివే కదా బీజేపీ ఏమీ వైఎస్సార్సీపీ భాగస్వామి కాదు కదా అనుకోవచ్చు. కానీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి అవగాహన ఉంటే పూర్తి విషయం అర్థం అవుతుంది. వైఎస్సార్సీపీ ఎన్డిఏ భాగస్వామ్య పక్షం కాకపోవచ్చు కానీ అది అనధికారిక అధికారపక్షమే. 2019కు ముందు టీడీపీ బీజేపీ నుంచి దూరం అయ్యాక.. వైసీపీ ఆ పార్టీకి దగ్గరైంది. కేంద్రంలో బీజేపీ బిల్లులకు వైసీపీ బేషరతుగా మద్దతు ఇవ్వడం.. ఇక్కడ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన బటన్ నొక్కే కార్యక్రమానికి కేంద్రం సహకారం అందించడం అన్నది కొన్నాళ్లుగా కొనసాగుతున్న పరస్పర అవగాహన. మరి ఇంతలో ఈ మార్పు ఎందుకు అంటే ఓ కారణం కనిపిస్తోంది.

పేజీ4లో

# ట్విట్టర్ వార్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మొన్న నిజామాబాద్ లో ఒక కార్యక్రమంలో నవ్వుకుంటూ పలకరించుకున్న, మాట్లాడుకున్న బండి సంజయ్, ఎమ్మెల్సీ కవితలు తాజాగా ట్విట్టర్ వేదికగా వార్ కు దిగారు. రాజకీయాల్లో పలకరించుకోవటాలు, అంతలోనే ఘాటుగా తిట్టుకోవటాలు మామూలే అని తాజాగా వీరిద్దరి ఘాటు ట్వీట్ లతో అర్థం అవుతుంది. తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ ట్విట్టర్లో చేసిన ట్వీట్ కు ఆమె ప్రతిగా రివర్స్ ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను బండి సంజయ్ ఏకరువు పెడితే, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎమ్మెల్సీ కవిత టార్గెట్ చేశారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత ఏమీ లేదని ఒకరినొకరు టార్గెట్ చేసి విమర్శలు గుప్పించారు. బండి సంజయ్ ట్విట్టర్లో చేసిన ట్వీట్లో గవర్నర్ కు గౌరవం దక్కదు. ఆడబిడ్డలకు లేదు అండ. గిరిజన మహిళలపై పోలీస్ గిరి. బతుకమ్మను అవమానించిన వాడి తో ఆలింగనం. ఇంటి బిడ్డ కు మాత్రం బలగంతో నిలబడతావ్ అడ్డం. అదిరింది కెసిఆర్ నీ మహిళా సంక్షేమం అంటూ కెసిఆర్ ను టార్గెట్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితులను చెప్పి దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జరుగుతున్న సంక్షేమ దినోత్సవాన్ని టార్గెట్ చేశారు. ఇక బండి సంజయ్ చేసిన ట్వీట్ కు ఎమ్మెల్సీ కవిత అంతే ఘాటుగా రిప్లై ఇచ్చారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో గిరిజన మహిళకు గౌరవం దక్కదు. మహిళా రెజ్లర్లు ధర్నా చేస్తున్నా తప్పు చేసిన బీజేపీ ఎంపీ పై చర్యలుండవు. నినాదాలకు బేటీ బచావో బేటీ పడావో పరిమితమైంది. సిలిండర్ ధరలు పెంచి మహిళలకు కిచెన్లో కన్నీళ్లు తెప్పిస్తున్నారు. మహిళల విద్య, వైద్యం పై నిర్లక్ష్యం, ఆడబిడ్డల సంక్షేమం కంటే కొందరి అభివృద్ధి ముఖ్యం. ఆడబిడ్డ తలచుకుంటే మీ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ బండి సంజయ్ కు కౌంటర్ ఇచ్చారు ఎమ్మెల్సీ కవిత. ఏది ఏమైనా బండి సంజయ్, కవితల మధ్య తాజా ట్విట్టర్ వార్ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది.

# ప్రభుత్వాసుపత్రుల్లో అవినీతిపై కఠిన చర్యలు



అమరావతి (ప్రశ్న న్యూస్) : వైద్య ఆరోగ్యశాఖపై తన క్యాంపు కార్యాలయంలో సీఎం వైయస్.జగన్ సమీక్ష నిర్వహించారు. ఇందులో పలు కీలక అంశాలపై అధికారులతో జగన్ చర్చించారు. వీటిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు, అవినీతి, మెడికల్ కాలేజీల ఏర్పాటుతో పాటు పలు అంశాలున్నాయి. అనంతరం సీఎం జగన్ వైద్యఆరోగ్యశాఖల అధికారులకు పలు కీలక ఆదేశాలు కూడా ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవినీతికి చోటు ఉండకూడదని సీఎం జగన్ తెలిపారు. ఫిర్యాదు చేయడానికి టెలిఫోన్ నంబర్ ప్రతిచోటా ఉంచాలన్నారు. అలాగే సమర్థవంతమైన ఎస్ఓపీలను పెట్టాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్కుల పనితీరు ఇందులో కీలకం అన్నారు. ప్రివెంటివ్ కేర్‌లో మనం ఆశించిన లక్ష్యాలను అప్పుడే సాధించగలమన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో రిక్రూట్‌మెంట్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలని జగన్ సూచించారు. ఓ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీచేయాలన్నారు. ఎక్కడా కూడా సిబ్బంది కొరత అన్నది ఉండకూడదన్నారు. 4 వారాలకు మించి.. ఎక్కడా ఏ ఖాళీ కూడా ఉండకూడదని ఆదేశించారు. సీఎం ఆదేశాలమేరకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఫస్ట్‌ఎయిడ్, స్నేక్ బైట్, ఐవీ ఇన్‌ఫ్యూజన్, ఇంజక్షన్, వూండ్ కేర్, డ్రెస్సింగ్, బేసిక్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ లాంటి అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చామన్నారు. అక్టోబరు22న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ 1,39,97,189 మందికి సేవలు అందించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా సేవలందుకున్నవారిలో 35,79,569 మంది హైపర్ టెన్షన్‌తో, 24,31,934 డయాబెటిస్‌తో బాధపడతున్నట్టు గుర్తించారు. వీరికి మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పేషెంట్‌కు చికిత్స అందించడంతోపాటు.. వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలన్నారు. విలేజ్ క్లినిక్ స్థాయిలో కంటి పరీక్షలు కూడా చేయాలన్నారు. క్రమం తప్పకుండా ఈ పరీక్షలు చేయాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియాను నివారించే కార్యక్రమంపై సీఎం సమీక్ష చేశారు. ఈ ఏడాది 6.68 లక్షలమందికి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ నెలలోనే అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పరీక్షలు ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. ఓరల్ హెల్త్‌లో భాగంగా దిశగా అడుగులు వేయాలని సీఎం సూచించారు. ప్రతి కుటుంబంలో పుట్టే బిడ్డ దగ్గరనుంచి ప్రతి ఒక్కరికీ కూడా ఆరోగ్యశ్రీకార్డు ఇవ్వాలన్నారు. క్యూ ఆర్ కోడ్ ఉన్న ఈ కార్డు ద్వారా వారి ఆరోగ్యవివరాలను ఇందులో నమోదు చేయాలన్నారు. అనంతరం మెడికల్ కాలేజీలపైనా సీఎం సమీక్ష చేశారు. ఈ విద్యాసంవత్సంలోనే ప్రారంభం కానున్న కొత్త మెడికల్ కాలేజీల్లో మౌలికసదుపాయాలపై సీఎం సమీక్షించారు. మెడికల్ కాలేజీలు చరిత్రలో నిలిచిపోయే నిర్మాణాలని, ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కొత్త మెడికల్ కాలేజీల్లో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభం కానుండగా.. పాడేరు, పులివెందుల, ఆదోని కొత్త మెడికల్ కాలేజీల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు మొదలవుతాయని, మిగిలిన కాలేజీల్లో కూడా పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

# ఉద్యోగులు సంతోషంగా ఉంటేనే డెలివరీ మెకానిజం బాగుంటుంది

-ముఖ్యమంత్రి జగన్‌తో ఉద్యోగుల సమావేశం

-సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్పిన ఉద్యోగులు

-ఉద్యోగులు సంతోషంగా ఉండాలన్న సీఎం జగన్



అమరావతి (ప్రశ్న న్యూస్) : ఉద్యోగులు సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుందంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశించి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయ కారణాలతో చెప్పే వాటిని నమ్మవద్దని ఆయన ఉద్యోగులకు సూచించారు.-సీఎం ను కలిసిన ఉద్యోగులు ,తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను ఆంధ్రప్రదేశ్ జేఏసీ అమరావతితో సహా పలు ఉద్యోగ సంఘాల నేతలు కలిశారు. కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు కొత్తగా జీపీఎస్ అమలులోకి తీసుకురావడం, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ ఏర్పాటు సహా ఉద్యోగుల విషయంలో తీసుకున్న నిర్ణయాల పై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపాయి.

### - ఆ మాటలను నమ్మకండి,

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలన్నీ కూడా 60 రోజుల్లోగా పూర్తిగా అమల్లోకి రావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎక్కడా జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. డైలీవేజ్ కేటగిరీ ఉద్యోగులను కూడా ఆప్కాస్ పరిధిలోకి తీసుకుని రావాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం ఆదేశాలిచ్చారు. ఉద్యోగులంతా సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుందని, ప్రజలు సంతోషంగా ఉంటారని జగన్ అభిప్రాయపడ్డారు. ఉద్యోగులను సంతోషంగా ఉంచడానికి ప్రతి కార్యక్రమం కూడా మనసా, వాచా, కర్మణా చిత్తశుద్ధితో అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎప్పుడూ ఉద్యోగులు తమ దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సూచించారు.

### -రాజకీయంతో చూడకండి,

ఎవరైనా రాజకీయ కారణాలతో ఏదైనా చెప్పినా ఉద్యోగులు వాటిని విశ్వసించాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. తాను మనస్ఫూర్తిగా ఉద్యోగుల గురించి ఆలోచించటంతో పాటుగా, మంచి చేయడం కోసమే పని చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే అన్నింటినీ పరిష్కరిస్తున్నామని తెలిపారు. చరిత్రలో తొలిసారి, తమ ప్రభుత్వం సమస్యలను సమస్యలుగా వదిలేయకుండా, ప్రతి సమస్యకు ఒక పరిష్కారం చూపాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. దీని వలన ఉద్యోగులకు సైతం మంచి జరగాలని జగన్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా మంచి జరగాలని ఆలోచన చేశామని, జీపీఎస్ కోసం దాదాపు రెండు సంవత్సరాలు కసరత్తు చేసినట్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఉభయ ప్రయోజకరంగా ఉండే విధంగా జీపీఎస్‌ను రూపొందించామని జగన్ ఉద్యోగులకు వివరించారు. భవిష్యత్ తరంలో వచ్చే ఉద్యోగుల్లో సైతం ఆ రోజు జగన్ ఉద్యోగులకు మంచి చేశాడని చెప్పుకునే విధంగా తన విధానాలు ఉంటాయని సీఎం భరోసా ఇచ్చారు. అంతే కాదు ఉద్యోగులకు మంచి చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి సైతం ముఖ్యమంత్రి హోదాలో జగన్ బాధ్యతగా పని చేశారనే అభిప్రాయం కూడా కల్పించాల్సిన భాధ్యత తన పై ఉందని అన్నారు. ఉద్యోగులు రోడ్డు మీదకు రాకూడదనే ఉద్దేశ్యంతో మంచి ఆలోచన చేశామని, జీతం బేసిక్‌లో కనీసం 50 శాతం పెన్షన్‌గా వచ్చేట్టు ఏర్పాటు చేశామని తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణలోకి తీసుకుని డీఆర్‌లు జీపీఎస్‌లో ఇస్తున్నామని,రిటైర్ అయిన ఉద్యోగుల జీవన ప్రమాణాలు స్థిరంగా మెయింటైన్ కావడానికి తగినట్టుగా గ్యారంటీ పెన్షన్ స్కీంను తీసుకువచ్చామన్నారు.

ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

జూన్ 14 / శుక్రవారం / 2023

## ముక్కు నేలకు రాసి, కరీంనగర్ ప్రజలకు క్షమాపణ చెప్పండి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్) :** కరీంనగర్ లోని తీగలగుట్టపల్లి ఎల్సి నెం.18 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించి టెండర్లు ఖరారయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇది తమ ఘనతగా చెప్పుకుంటూ, బీఆర్ఎస్ నేతలు సీఎంకు పాలాభిషేకం చేస్తూ సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆర్వోబీ కి కేంద్రం ఆమోదం తెలిపి 7 నెలలైనా ఇంతవరకు ఎందుకు టెండర్ పనులను ఖరారు చేయలేదో సమాధానం చెప్పాలి. గత నెల టెండర్లకు ఆహ్వానించి మళ్ళీ వెనక్కు తీసుకోవడానికి కారణం ఏంటో ప్రజలకు తెలపాలి. ఆర్వోబీ నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం ?126.74 కోట్లను కేంద్రమే చెల్లించేందుకు అంగీకరించిన విషయం నిజం కాదా? అని బీఆర్ఎస్ నేతలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణ పనులను ప్రారంభించి తొందరగా పూర్తి చేయాలని అనేకమార్లు తాను తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం వాస్తవం కాదా ? జాప్యాన్ని నిరసిస్తూ బిజెపి నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేసింది నిజం కాదా ? అని బండి సంజయ్ అడిగారు. "గత సంవత్సరం ఆర్వోబీ నిర్మాణానికయ్యే ఖర్చులో 80 శాతం వాటా చెల్లించడానికి తొలుత అంగీకరించి, ఆ తరువాత మాట తప్పింది ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? ఆ తర్వాత ఒక బాధ్యత గల పార్లమెంట్ సభ్యుడిగా కరీంనగర్ ప్రజల అవసరాలను, అవస్థలను దృష్టిలో ఉంచుకొని, కేంద్ర ప్రభుత్వాన్ని ఈ ఆర్వోబి నిర్మాణ వ్యయం మొత్తం భరించేందుకు ఒప్పించినట్లు తెలిపారు. ఈ నిర్మాణాన్ని మేమే చేస్తామని కేంద్రానికి చెప్పి, ఇన్ని రోజులు జాప్యం చేస్తూ, కరీంనగర్ ప్రజల అవస్థలకు కారణం అయ్యారు. తిరిగి కేంద్రం వల్లే జాప్యమవుతోందంటూ కేంద్రంపై నిందలేస్తారా ?" అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆర్వోబీ నిర్మాణం విషయంలో జరుగుతున్న జాప్యానికి తామే కారణమంటూ ముక్కు నేలకు రాసి, కరీంనగర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. దీంతోపాటు వెంటనే పనులు ప్రారంభించి, నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసి కరీంనగర్ ప్రజల ఇబ్బందులను తొలగించాలని బండి సంజయ్ ట్వీట్ ద్వారా డిమాండ్ చేశారు.

## సీమ నేలకు నమస్కరించి భావోద్వేగానికి గురైన లోకేష్

**రాయలసీమలో పూర్తయిన లోకేష్ పాదయాత్ర**
**లోకేష్‌కు వీడ్కోలు పలికిన రాయలసీమ నేతలు**
**సీమ నేలకు నమస్కరించి భావోద్వేగానికి గురైన లోకేష్**



**కడప (ప్రశ్న న్యూస్) :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి చేపట్టిన యువగళం పాదయాత్ర రాయలసీమలో పూర్తయ్యింది. లోకేష్‌కు రాయలసీమ టీడీపీ ముఖ్య నేతలు వీడ్కోలు పలికారు. రాయలసీమ నేలకు నమస్కరించిన నారా లోకేష్ భావోద్వేగానికి గురయ్యారు. సీమలో తన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని లోకేష్ వ్యాఖ్యానించారు. తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు నారా లోకేష్ కృతజ్ఞతలు చెప్పారు.

??మిషన్ రాయలసీమతో మీ రుణం తీర్చుకుంటా

'రాష్ట్రంలో ఈ నాలుగేళ్ల పాలనలో బాధితులుగా మారిన ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా నేను చేపట్టిన యువగళం పాదయాత్ర తొలి మజిలీని మీ అందరి ఆశీస్సులతో విజయవంతంగా పూర్తి చేయగలిగాను. 124 రోజుల పాటు నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్రలో.. నాతోపాటు యువగళం బృందాలను కంటికి రెక్కలా కాపాడుకుంటూ.. రాయలసీమ ప్రజలు మాపై చూపిన ఆదరాభిమానాలను జీవితంలో మరువలేను' అని నారా లోకేష్ వ్యాఖ్యానించారు. 'అడుగడుగునా సీమ ప్రజల కష్టాలను నేరుగా చూశాక తీవ్ర మనోవేదనకు గురయ్యాను. రాయలసీమ బిడ్డగా ఈ ప్రాంతంలో నెలకొన్న సాగు, తాగు నీరు, నిరుద్యోగం, వలసల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించుకున్నాను. అధికారంలోకి వచ్చిన వెంటనే మిషన్ రాయలసీమ ద్వారా మీ కన్నీళ్లు తుడిచి రుణం తీర్చుకుంటా. యువగళం సాక్షిగా ఈ మాట ఇస్తున్నాను. ఎంతటి గడ్డు పరిస్థితుల్లోనైనా ప్రత్యర్థులకు ఎదురొడ్డి నిలబడే పోరాట స్ఫూర్తిని మీ నుంచి పొందిన నేను లక్ష్యాన్ని చేరుకునేవరకు విశ్రమించబోను' అని లోకేష్ స్పష్టం చేశారు. రాయలసీమ నుంచి లోకేష్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించారు. లోకేష్‌కు నెల్లూరు తెలుగుదేశం నేతలు ఘన స్వాగతం పలికారు. బీద రవిచంద్ర యాదవ్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, కంభం విజయరామిరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కోమ్మి లక్ష్మయ్య నాయుడు, ఆనం వెంకట రమణ రెడ్డి, తాళ్లపాక రమేష్ రెడ్డి, కాకర్ల సురేష్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పనబాక కృష్ణయ్య, కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, మాలేపాటి సుబ్బనాయుడు, తాళ్లపాక అనురాధ, ఆనం రంగమయూర్ రెడ్డి, లోకేష్‌కి స్వాగతం పలికారు.

## ఆరో బ్రాండ్ నుంచి విభిన్నమైన సమ్మర్-స్ప్రింగ్ కలెక్షన్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** ఐకానిక్ ప్రీమియం మెన్స్ వేర్ బ్రాండ్ అయిన ఆరో తాజాగా తన సమ్మర్ స్ప్రింగ్ కలెక్షన్‌ను విడుదల చేసింది. ఈ కొత్త కలెక్షన్‌లో లేటెస్ట్ ట్రెండ్లు ఉండటంతో పాటు.. మూలాలను మర్చిపోకుండా ఉంటుంది. పురుషుల దుస్తుల్లో అన్ని సందర్భాలకూ సరిపోయేలా ఆరో ఉంటుంది. ఆటోప్రెస్ షర్టులు, ఆటోఫ్లెక్స్ ప్యాంట్లు, ఐకానిక్ వైట్ షర్టులతో సహా ఫార్మల్ వేర్లు ఈ కొత్త కలెక్షన్‌లో ఉన్నాయి. ఆటోప్రెస్ షర్ట్ ముడతలు లేని వస్త్రానికి ప్రసిద్ధి చెందింది. ఇది పీచ్, లీలాక్, లేత గోధుమరంగు / క్రీమ్ షేడ్స్ కలిగిన మూడు రంగులలో లభిస్తుంది. ఆటోఫ్లెక్స్ ప్యాంటు సౌకర్యవంతమైన వెయిస్ట్ బ్యాండ్ ను కలిగి ఉంటుంది. దీనివల్ల ప్రీమియంగా కనిపించడంతో పాటు సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తూ, అన్నిరకాల పనులు చేసుకోడానికి వీలుగా ఉంటుంది. ఐకానిక్ వైట్ షర్టులు వార్డ్ రోబ్‌కు అందాన్ని తీసుకొస్తాయి. వీటిని స్నేహితులు, కుటుంబ సభ్యులతో పెళ్లిళ్లు, సాధారణ విహారయాత్రల్లాంటి సందర్భాలలో ఉపయోగించవచ్చు. ఈ కలెక్షన్‌లో సూట్లు, బ్లేజర్లు కూడా ఉన్నాయి. ఈ శ్రేణిలో పింక్, లేత ఆకుపచ్చ, లేత గోధుమ వంటి లేత రంగులలో సూట్లు ఉన్నాయి. ఇవి పగటి పెళ్లిళ్లకు ఉంటుంది. ఇది స్టైలిష్‌గా, వెర్సటైల్‌గా ఉంటుంది. లినెన్ కలెక్షన్ అనేది రిలాక్స్‌డ ఫ్యాబ్రిక్, వాటి యాంటీ-కర్లింగ్ కాలర్లకు ప్రసిద్ధి చెందాయి. బ్రోన్సన్ స్లిమ్ ఫిట్ తో ఈ చినోస్ ను డిజైన్ చేశారు. స్టెయిన్ రెసిస్టెంట్ టెక్నాలజీ ఈ చినోలను ఎక్కువసేపు తాజాగా ఉంచుతుంది. ఈ లుక్ మామూలు రోజులకు అనువైనది. మరియు కుట్టిన బ్లేజర్‌తో కలిపి వేసుకుంటే ఇది ఎలివేటెడ్ లుక్ ఇస్తుంది. ఆరో న్యూయార్క్ లైన్‌లో ఆధునిక వర్క్ వేర్, క్యాజువల్ దుస్తులు ఉన్నాయి. ఇంకా ఫ్యూచరిస్టిక్ పోలోలు, గ్రాఫిక్ ప్రింట్ తో కూడిన టీ-షర్టులు ఉన్నాయి. ఇది ప్రధానంగా మిలీనియల్ ఆడియన్స్‌కు సరైనది. టెన్నిస్ కోర్టుల నుంచి ప్రేరణ పొందిన కోర్ట్ క్లబ్ లైన్‌లో రిలాక్స్ డ్, సరదా, సోషలబుల్ ఫోటోలు, షర్టులు ఉన్నాయి.

## తట్టెడు మట్టి మోయ్యలేదు, ఒకటే గప్పాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పైన విమర్శలు చేశారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించిన ప్రాజెక్టులతో ఆయన 20 లక్షల ఎకరాలకు అదనంగా నీళ్లు ఇస్తే, కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరానికైనా అదనంగా సాగునీరు అందిందా? అని ప్రశ్నించారు. "కష్టం ఒకరిదైతే ప్రచారం మరొకరిది ఈ సామెత అబద్ధాల కేసీఆర్ కి సరిపోతుంది. పాలమూరు కన్నీళ్లను చూసి సాగునీళ్ళు ఇచ్చింది వైఎస్సార్ అయితే తట్టెడు మట్టి మోయని కేసీఆర్ తానే జలకళ తెచ్చినట్లు గప్పాలు కొట్టుకుంటున్నడు. అందుకే అంటారు "సొమ్మొకడిది - సోకొకడిది అని" ఎన్నికల వేళ సోకు మాటలు చెప్పే దద్దమ్మ గారు - పాలమూరు ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు సిద్ధమా? పడావు బడ్డ బీడు భూముల్లో కృష్ణా జలాలు పారించిన ఘనత ఎవరిదో చర్చకు రాగలరా? వైఎస్సార్ జలయజ్ఞం కింద వేసిన పునాదులే.. నేడు కేసీఆర్ చెప్తున్న 20 లక్షల ఎకరాలకు సాగునీళ్ళు ఇచ్చే ప్రాజెక్టులు. కల్వకుర్తి ద్వారా 4 లక్షల ఎకరాలు, బీమా కింద 2 లక్షల ఎకరాలకు, నెట్టెంపాడుతో 2 లక్షల ఎకరాలు, కోయిల్ సాగర్ కింద 60 వేల ఎకరాలు, గట్టు, తుమ్మిల్ల, సంగంబండ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రిజర్వాయర్లు. వైఎస్సార్ హయాంలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తే.. మీ పదేళ్ల పాలనలో ఒక్క ఏకరాకు అదనంగా సాగునీరు ఇచ్చారా దొర గారు? పాలమూరు - రంగారెడ్డి పేరు చెప్పి 35 వేల కోట్లు మెక్కారే తప్ప ఒక్క ఎకరాను తడిపింది లేదు. 10 లక్షల ఎకరాలు అని చెప్పి 10 ఎకరాలు తడిపింది లేదు. 3 ఏళ్లలో ప్రాజెక్ట్ పూర్తి అని చెప్పి 9 ఏళ్లలో 35 శాతం కూడా పనులు కాలేదు. వైఎస్సార్ బతికి ఉంటే పాలమూరు ప్రాజెక్ట్ పూర్తయ్యేది. 10 లక్షల ఎకరాలకు ఏనాడో సాగునీరు అందేది. పడావు బడ్డ పాలమూరు భూములకు సాగునీళ్ళు ఇచ్చిన అపర భగీరథుడు వైఎస్సార్. వెనుక బడ్డ జిల్లాలోనూ ప్రాజెక్టుల పేరు చెప్పి కమీషన్లు దండుకున్న దొంగ కేసీఆర్. మహానేత హయాంలో "మైగ్రేషన్ వద్దని ఇరిగేషన్" చేస్తే.. నేడు ఇరిగేషన్ పక్కన పెట్టి మైగ్రేషన్ వైపే మళ్లేలా ఉంది దొర కేసీఆర్ పాలన. రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్ళైనా వలసలు ఆగలేదు. 15 లక్షల మంది పాలమూరు బిడ్డలకు బొంబాయి, దుబాయ్ కష్టాలు తీరలేదు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ మీదున్న ప్రేమ దొరకు పాలమూరు మీద లేకపాయే. ఉద్యమ సమయంలో పార్లమెంట్ కి పంపిన గడ్డ అని ఏనాడో మరిచిపోయే" అని వైఎస్ షర్మిల ట్వీట్లు చేశారు.

## మహిళా సంక్షేమంలో తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కేసీఆర్ సర్కార్ అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి ఆరు పదులు దాటిన అవ్వల వరకు అందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని వివరించారు. ఆకాశంలో సగం కాదు ఆమే ఆకాశం అంటూ రాసుకొచ్చారు. సంక్షమంలో సగం కాదు ఆమే అగ్రభాగం అని మంత్రి కేటీఆర్ వివరించారు. అమ్మఒడి వాహనమైనా ఆరోగ్య లక్ష్మి పథకం అయినా ఇలా ఏదైనా మహిళల కోసమే అని స్పష్టం చేశారు.

భర్తను కోల్పోయిన అక్కాచెల్లెల్లకు అన్నలా, ఒంటరి మహిళలకు తండ్రిలా, ఆడబిడ్డలకు మేనమామలా, అవ్వలకు పెద్ద కొడుకులా, కొండంత అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ను మనసారా ఆశీర్వదిస్తున్న యావత్ మహిళా లోకానికి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఆయన ట్వీట్ చేశారు. కల్యాణ లక్ష్మికేవలం పథకం కాదు ఒక విప్లవం అని మంత్రి కేటీఆర్ వివరించారు. ఓవైపు భ్రూణహత్యలకు బ్రేక్ వేస్తూనే, మరోవైపు బాల్యవివాహాలకు ఫుల్ స్టాప్ పెట్టిందీ పథకం అని చెప్పుకొచ్చారు. ఇంకోవైపు తల్లిదండ్రుల భారాన్ని దించే భరోసా అని పది లక్షలకు పైగా ఆడబిడ్డల పెండ్లిళ్లు చేసిన మేనమామ సీఎం కేసీఆర్ అంటూ ప్రశంసించారు. గుక్కెడు మంచినీళ్ల కోసం.. మైళ్లదూరం నడిచిన మహిళల కష్టాలను, మిషన్ భగీరథతో శాశ్వతంగా తీర్చిన విజన్ ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ అంటూ చెప్పుకొచ్చారు. గర్భిణీలకిచ్చే న్యూట్రిషన్ కిట్లు ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి తొలి అడుగులు అని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆడబిడ్డ పుట్టిందంటే.. ఇంట్లో లక్ష్మీదేవి అడుగు పెట్టినట్టేనని వివరించారు. కేసీఆర్ కిట్ తోపాటు అందే 13 వే, ప్రతి పుట్టిల్లు ఎప్పటికీ మరువలేని మేలు అని అన్నారు. లక్ష్మీ కటాక్షమే కాదు.. తెలంగాణ ఆడబిడ్డలకు సరస్వతి కటాక్షం కూడా అందేలా చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. కార్పొరేట్ కు ధీటైన, గురుకులాలతో తల్లిదండ్రుల కలలు సాకారం చేసిన సర్కారు ఈ సర్కారు అంటూ స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు రక్షణ కవచంగా నిలిచిన "షీటీమ్" ఓ సంచలనం అని అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే "వీహబ్" అంతకు మించినదని వివరించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, మార్కెట్ కమిటీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఓ ప్రోత్సాహం అంటూ వెల్లడించారు. ప్రతి బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ ఓ గొప్ప సంప్రదాయం అంటూ మంత్రి కేటీఆర్ తెలిపారు.

## కార్యకర్తల్లో అసంతృప్తి పోగొట్టేలా వైసీపీ ప్లాన్



**అమరావతి (ప్రశ్న న్యూస్):** పార్టీ విజయం కోసం పని చెయ్యండంటూ రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి క్యాడర్ కు పిలుపునిచ్చారు. పార్టీ అనుబంధ విభాగాల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యకాలాపాలను వేగవంతం చేసే క్రమంలో భాగంగా విజయసాయి రెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అనుబంధ సంఘాలతో వరుసగా సమావేశం అవుతున్నారు. గత వారం రోజులుగా అనుబంధ సంఘాలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు విజయసాయిరెడ్డి. పార్టీలో ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేయాలని విజయ సూచిస్తున్నారు. పార్టీ సేవాదళ్, ఐటీ విభాగాల జోనల్ ఇంచార్జీలు, జిల్లా అధ్యక్షులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు సాయిరెడ్డి.

??ఎమ్మెల్యేలతో సమన్వయం కీలకం

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న సమావేశాల్లో పార్టీ క్యాడర్‌కు విజయ సాయి కీలక ఆదేశాలు ఇస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నియోజకవర్గ ఇంచార్జ్, లేదా శాసన సభ్యుడే సుప్రీం అంటూ స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు. దీని వల్ల పార్టీలో రెండో గ్రూపును ప్రోత్సహించేందుకు అవకాశం లేకుండా జాగ్రత్తలు పడగలమని అంటున్నారు. శాసన సభ్యులు, నియోజవర్గ సమన్వయకర్తలతో సమన్వయం చేసుకుంటూ సేవాదళ్, ఐటి విభాగాల జిల్లా స్థాయి, మండల స్థాయి కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ముఖ్యమంత్రి జగన్ నిర్వహించిన పాదయాత్రలో కలిసి నడిచిన వారికి, ప్రతిపక్షంలో సేవా దళ్ విభాగంలో పని చేసిన వారికి ప్రభుత్వం వచ్చాక తగిన గుర్తింపు లభించిందని అన్నారు. 2019లో పార్టీ విజయం కోసం పని చేసిన వారికి జగన్ సముచిత స్థానం కల్పించారని తెలిపారు.

??భవిష్యత్‌పై భరోసా కల్పిస్తాం

పార్టీ అనుబంధ సంఘాల సమావేశాల్లో పాల్గొంటున్న నేతలకు విజయ సాయి భరోసా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. భవిష్యత్తులో నాయకులుగా ఎదిగేందుకు పార్టీ మీకు మరిన్ని అవకాశాలు ఇస్తుందని చెబుతున్నారు. పార్టీలో ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. అనుబంధ విభాగాల జిల్లా స్థాయి మండల స్థాయి కమిటీలు పూర్తైన తర్వాత అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్చార్జీలు, జిల్లా అధ్యక్షులతో జగన్ సమావేశం అవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్చార్జీలు, జిల్లా అధ్యక్షులకు సముచిత స్థానం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

??పార్టీ కార్యకలాపాలపై ఫోకస్

పార్టీ అనుబంధ సంఘాలకు ఇంచార్జ్‌గా ఉన్న విజయసాయి, కార్యకలాపాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. గత వారం రోజులుగా ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఉంటున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు పార్టీ కార్యకలాపాల పైనే ఎక్కువ ఆరా తీస్తున్నారు. తాజా రాజకీయ పరిణామాలతో ప్రతిపక్షాలన్నీ దాడి చేస్తున్న వేళ భవిష్యత్ రాజకీయాలను ఎలా అధిగమించాలి, రాబోయే రోజులు పరిణామాలను కార్యకర్తలకు, క్యాడర్‌కు వివరిస్తున్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి సైతం ప్రతికార్యకర్తకు అందుబాటులో ఉండే విధంగా పార్టీపరంగా ప్రత్యేకంగా ప్లాన్ వేస్తున్నారు. వీటన్నింటికన్నా ముందు పార్టీ అగ్రనాయకత్వం అనుబంధ సంఘాలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు.

## స్టాంపీడ్ క్యాపిటల్ లిమిటెడ్ కంపెనీకి సూత్రప్రాయ ఆమోదం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఎద్యు ప్రైవేట్ లిమిటెడ్ దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలకు అనుగుణంగా విలీనం, కొనుగోలు చేయడానికి లేదా ఇతర అనువైన అవకాశాల కోసం స్టాంపీడ్ క్యాపిటల్ లిమిటెడ్ సంస్థ సూత్రప్రాయంగా ఆమోదం పొందింది. డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఎద్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ఈక్విటీ విలువను నిర్ణయించడానికి కంపెనీ పిడబ్ల్యుసి బిజినెస్ కన్సల్టింగ్ సర్వీసెస్ ఎల్‌ఎల్పీని నియమించింది. డబ్ల్యూఈఎక్స్‌ఎల్ అనేది పాఠశాలలు, కళాశాలలు, సంస్థలు, కోచింగ్ సెంటర్లు, ఇతర విద్యా సంస్థలు/వాటాదారులకు డిజిటల్ ప్లాట్ ఫాంను అందించే ఆన్ లైన్ విద్యా సంస్థ . ఈ కంపెనీ ప్రస్తుతం 46 పాఠశాలలతో ఒప్పందాలు/ఎంఒయుల ద్వారా 27,000 మంది విద్యార్థులను చేర్చుకుంది. అంతేకాకుండా... 90,300 మంది విద్యార్థులు ఉన్న 154 పాఠశాలలను కంపెనీలో చేర్చుకోవడానికి, వివిధ దశల్లో కంపెనీ పరిశీలిస్తోంది. డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఒక ప్రత్యేకమైన పరిశోధన-ఆధారిత ప్రోగ్రామ్ (మైక్రో లెర్నింగ్ ప్రోగ్రామ్) ను అభివృద్ధి చేసింది. ఇది వినియోగదారుల పనితీరులో 30%-50% మెరుగుదలకు హామీ ఇస్తుంది. వాల్యూ అనాలిసిస్ ప్రకారం డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఈక్విటీ విలువ రూ.91 కోట్ల నుంచి రూ.101 కోట్ల మధ్య ఉంటుందని పీడబ్ల్యూసీ అంచనా వేసి తన నివేదికలో తెలిపింది.

## ఉజ్వల భవిష్యత్తుకు చదివే దివ్యాస్త్రం



**(లక్ష్మణ్- స్టేట్ బ్యూరో- ప్రశ్న న్యూస్ ):** విద్యతో పాటే క్రమశిక్షణ సేవా భావం కలిగి ఉండాలి. కష్టపడితేనే ఏ లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చు అని ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని చేరుకునేందుకు బాగా కష్టపడి ఇష్టంగా చదవాలి అని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ అన్నారు. చిన్నతనం నుంచి కష్టపడి చదివి మంచి స్థాయిలో రావాలనేదే.. కావాలనేదే నా లక్ష్యం అని. దానిని చేరుకునేందుకు ఎంతో కష్టపడి చదివా. నిద్రలేని రాత్రిళ్లు గడిపా. మీరు కూడా లక్ష్యాన్ని ఎంచుకొని.. ఆ దిశగా విద్యార్థిని విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదవాలని ఆర్డీవో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదివినప్పుడే అత్యున్నతమైన స్థానాన్ని పొందుతారని గూడూరు ఆర్డీవో ఎం. కిరణ్ కుమార్ అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని తెలిపారు. అలాంటి వారు కష్టపడి చదివినప్పుడు ఏదైనా సాధించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా మంచి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన వారమవుతారని ఆర్డీవో కిరణ్ కుమార్ తెలిపారు. సమాజంలో పేదరికాన్ని ఎదిరించాలంటే విద్య ప్రధాన మార్గమని దీనికి మించిన మరో ఆయుధం లేదని ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచి విద్యాబుద్ధులు నేర్పి సత్ప్రవర్తనతో మెరిగెల పిల్లలకు దిశా నిర్దేశం చేసే బాధ్యత మొదటిది తల్లిదండ్రులు అయితే రెండవది గురువులదని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం వల్లే నేడు ఈ స్థితిలో ఉన్నానన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. నేడు విద్య ప్రపంచీకరణ దిశగా సాగుతోందని, ఉన్నత చదువులు చదవడానికి విద్యార్థికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలో ఉన్నత స్థాయి ప్రమాణాలతో సీఎం జగన్ మోహన్ రెడ్డి విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని. విద్యార్థులకు నిస్వార్థంగా విద్యను అందిస్తోందన్నారు. చిన్నతనం నుంచి కష్టపడి చదివి విద్యార్థిగా ఈ స్థాయికి ఎదిగినట్లు వివరించారు. విద్యార్థి వికాశం ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని, వారు నేర్పే క్రమశిక్షణ ద్వారా మాత్రమే విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించగలడని తెలిపారు. పేదరికంలో పుట్టిన వారికే బాధలు ఎదుర్కొన్న సమస్యలు కళ్ళారా చూస్తున్నారు కాబట్టి కసితో ఇష్టపడి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రధాన ఆయుధం విద్యే లక్ష్యం పైనే దృష్టి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరడం పట్టు వీడని విక్రమార్కుడిలా గమ్యం చేరడమే లక్ష్యంగా ప్రతి విద్యార్థి ఇష్టపడి కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని .గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ విద్యార్థినీ విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇస్తూ ఆకాంక్షించారు.

## నకిలీ విలేకరులపై చర్యలు తీసుకునేంత వరకూ పోరాటం




**నెల్లూరు బ్యూరో( ప్రశ్న న్యూస్ ) :** ప్రజా సమస్యలపై నిత్యం తమ గళాన్ని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవచూపే పాత్రికేయులు సోమవారం సొంత సమస్యలపై రోడ్డెక్కారు. గూడూరు పట్టణంలో 50 మంది వివిధ దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న విలేకరులు మున్సిపల్ కార్యాలయం ఎదుట న్యాయమైన డిమాండ్ల సాధనకోసం రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఈ న్యాయ పోరాటానికి పట్టణంలోని పార్టీలు, ట్రేడ్ యూనియన్లు సంఘీభావం తెలిపాయి. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ రిలే దీక్షా శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులకు మద్దతు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో అవినీతి, అక్రమాలను సహించబోమన్నారు. గూడూరు మున్సిపాలిటీలో అవినీతి అధికారులు పెట్రేగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వారిని కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉండే జర్నలిస్టులే, మునిసిపల్ అధికారుల వైఖరితో రోడ్డుకెక్కిన పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా ముగింపు పలుకుతామన్నారు. గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్ అయినందున వెంటనే చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సమస్యపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసే విధంగా ప్రజల్లో కూడా మార్పు రావాలని ఆయన సూచించారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని సీపీఐ, సీపీఎం నాయకులు సీహెచ్. ప్రభాకర్, శశి కుమార్, ఎంబేటి చంద్రయ్య, జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. విలేకరులకు మద్దతుగా న్యాయ పోరాటంలో భాగస్వాములవుతామన్నారు. బీజేవైఎం తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ మాట్లాడుతూ నకిలీ విలేకరులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ పాత్రికేయులు భూషణ్ రెడ్డి, షేక్. జమాలుల్లా మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం 3.20 ఎకరాలను జర్నలిస్ట్ కాలనీ కోసం కేటాయించారన్నారు. అప్పటినుండి పూరి గుడిసెలు వేసుకుని ఉంటున్నామన్నారు. అయితే కొంతమంది నకిలీ విలేకరులు ఆ స్థలాలలో జొరబడి కమిషనర్ నుండి ఎన్‌ఓసీలు తెచ్చుకున్నారని తెలిపారు. కొంతమంది జర్నలిస్ట్ కాలనీ పేరుతో లక్షల రూపాయలు దండి సొంత ఖర్చులను ఉపయోగించుకుంటే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే 65 మంది పాత్రికేయులు ఒకవైపు ఉండి అన్యాయాన్ని ప్రశ్నిస్తుంటే పాలకులు, మున్సిపల్ అధికారులు ఆరుమంది విలేకరుల పక్షాన ఉంటూ అక్రమ ఎన్‌ఓసీలు ఇవ్వడం దారుణమన్నారు. విలేకరుల స్థలాలలో జోక్యాన్ని ఆపే వరకూ మా పోరాటం ఆగదన్నారు. అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, మైనారిటీ, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి, నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి, ఆరుగురు నకిలీ విలేకరులకు మంజూరు చేసిన ఎన్‌ఓసీలు రద్దు చేయాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
జూన్ 14/శుక్రవారం/2023

## వైభవంగా రేణుకా మాతా అభిషేకం



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్):** కొల్చారం రేణుకా మాతా ఆశీస్సులతో ప్రజలందరిని చల్లగా చూడాలని గంగు రేణుక సంజీవయ్య దంపతులు మాతను వేడుకున్నట్టు తెలిపారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ద్వితీయ వార్షికోత్సవం అనంతరం 28 వ మంగళవారం నాడు సంగారెడ్డి జిల్లా బిహెచ్ఈఎల్ రామచంద్రపూర్ వాస్తవ్యులు కొల్చారం సబ్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న లైన్ స్పెక్టర్ గంగు రేణుకా సంజీవయ్య దంపతులు ఎల్లమ్మ అభిషేక అలంకరణ కార్యక్రమం నిర్వహించగా చల్లూరి కృష్ణ శర్మ, సాగరిక ల మంత్రోచ్ఛహారణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో ప్రభాకర్,రామకృష్ణ గౌడ్, లక్ష్మినారాయణ గౌడ్, పాపగౌడ్ ,సత్యనారాయణగౌడ్,యాదగౌడ్, శేఖర్, నాగరాజు గౌడ్, దుర్గ ప్రసాద్ గౌడ్ , గంగు సంజన,గంగు లాలస, గంగు ఇందు, ప్రేమిల, బాలమణి,సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఫిట్ నెస్ లేని వాహనాల పై ఆర్టీఏ అధికారుల కొరడా



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్):** ఫిట్నెస్ లేని వాహనాలపై పార్టీ అధికారులు కొరడా జు లిపించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పురపాలక పరిధిలోని రాళ్లగూడలో గురువారం ఆర్టి అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మూడు స్కూల్ బస్సులు సిజ్ చేయడం జరిగిందని ఆర్ టి ఎ అధికారులు తెలిపారు.ఆర్ టి ఎ అధికారులు మాట్లాడుతూయస్ఫిఅప్ట్ నెస్, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్ లేకుండా నడుపుతున్న బస్సులపై చర్య చేపడుతున్న ట్ల ఆర్టీఏ అధికారులు తెలిపారు.వేసవి సెలవులు ముగియడం స్కూల్ లు పునః ప్రారంభం కావడంతో స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు.నిబంధనలు పాటించకుండా బస్సులను నడిపితే కఠిన చర్యలు తప్పవని అధికారులు తెలిపారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజేంద్ర నగర్ లో వైద్య ఆరోగ్య దినోత్సవం



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ బుధవారం ఉదయం 10:00 గం లకు ఉప్పర్ పల్లి పిల్లర్ నంబర్ 173 యస్ బి ఆర్ గార్డెన్ లో రంగారెడ్డి జిల్లా . డి ఎం ఎచ్ ఓ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా వైద్యారోగ్య దినోత్సవం సందర్భంగా న్యూట్రిషన్ కిట్ ప్రారంభోత్సవం వైద్యారోగ్య జిల్లా శాఖ సిబ్బందికి సన్మానం బహుమతుల ప్రధానం జరుగుతుందనిఈ కార్యక్రమానికి శాసనసభ్యులు టి ప్రకాష్ గౌడ్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ హాజరు అవుతున్నారని కావున బి ఆర్ యస్ పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్ తెలిపారు.

## జిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

**శంషాబాద్ (ప్రశ్న న్యూస్) :** జిఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జి ఎం ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. శంషాబాద్ పురపాలక పరిధిలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోచింగ్ నిర్వాహకులు శ్రీశైలం మాట్లాడుతూ పురపాలక పరిధిలోని ఆర్బి నగర్ లో వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రతిభా కాంపిటీటివ్ సెంటర్లో డిగ్రీ ఉత్తీర్ణైన నిరుద్యోగులకు రాష్ట్ర జాతీయస్థాయిలో వివిధ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారికి ఈ నెల 2వ తేదీ నుంచి మూడు నెలలపాటు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ లో వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. వివరాలకై 9951373742. 9966983185 సంప్రదించగలరు.

## భాజపా గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్) :** భాజపా గెలుపే లక్ష్యంగా ప్రతి భాజపా కార్యకర్త కృషి చేయాలని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమం ప్రజల మధ్యకు తీసుకువెళ్లాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి ఎస్ ప్రభాకర్ అన్నారు. శంషాబాద్ పురపాలక పరిధి లోమల్లికా కన్వెన్షన్ లో అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అధ్యక్షతన వివిధ మోర్చాల సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ యొక్క సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వి వి ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలోప్రభాకర్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఉన్నటువంటి రాజేంద్రనగర్ అసెంబ్లీ లో ఉన్నటువంటి వివిధ కమిటీలు కానీ మోర్చాలని అన్ని కమిటీలు పూర్తి చేయాలి బీజేపీ పార్టీ కోసం అన్ని మోర్చాలు పనిచేయాలి. శ్రీ నరేంద్ర మోడీ గారి ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలను ప్రజలకి తీసుకెళ్లి పథకాల గురించి వివరించాలే రాబోయే రోజుల్లో ఈ తెలంగాణ రాష్ట్రంలో బిజెపి గెలుపు దిశగా ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త మోర్చల పరంగా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి సీనియర్ నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజు అంజన్ కుమార్ గారు మల్లారెడ్డి శ్రీధర్ అశోక్ బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్ కిషోర్ చంద్రయ్య దేవేందర్ రాజేంద్రనగర్ అసెంబ్లీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

## సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎంపి రంజిత్ రెడ్డి.

**శంషాబాద్ (ప్రశ్న న్యూస్):** మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు చంద్రారెడ్డి కి మాత్రువియోగం పలువురు తెరాస నాయకులతో పాటు రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేవెళ్ల ఎంపి రంజిత్ రెడ్డి పలువురు నేతలు మంగళవారం ఉదయం గొల్లపల్లి లోని చంద్రా రెడ్డి ఇంటికి వెళ్లి తన.మాతృమూర్తి మృత దేహానికి సంతాపం గటించి నివాళు లర్పించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించిన టీపిసిసి అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) :** నర్సాపూర్ నియోజకవర్గ కౌడిపల్లి మండలంలో ముట్రాజ్ పల్లి, రాజి పేట్,వెంకటాపూర్ గ్రామలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమని కాంగ్రెస్ నాయకులు టీపిసిసి రాష్ట్ర ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ టీపీసీసీ రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి టీపిసిసి కార్యదర్శి రాజి రెడి కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సంధర్భంగా ఆంజనేయులు గౌడ్ మట్లాడుతు తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది. ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల సాయం, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీస పెన్షన్ 5000 రూపాయలుఆడబిడ్డలకు రు. 500 కే గ్యాస్ సిలిండర్, మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం రైతు రాజ్యాన్ని స్థాపిద్దాం అన్నారు. ఈ బిఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజా దనాని దుర్వినియోగ చెస్తునారు. కష్టపడి పండించిన రైతుల పంటను అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే, మహిళా చైర్పర్సన్ ఒకరోజు కూడా ధాన్యం కొనుగోలు సెంటర్లను సందర్శించలేరు. దశాబ్ది ఉత్సవాల పేరుటా ఏం ముఖం పెట్టుకొని గ్రమలల్లో తిరుగుతున్నారు. ఇప్పటికీ కూడా కొనుగోలు సెంటర్లో ధాన్యం అలాగే ఉన్నది. ధాన్యం అమ్ముకున్న రైతుల అకౌంటులో డబ్బులు ఒక్క రూపాయి కూడా పడలేదు. వెంకటాపూర్ గ్రామంలో వితంతు పింఛన్ల కోసం గత మూడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పింఛన్ రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా కమిషన్ సునీత రెడ్డి నర్సాపూర్ కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. తాను అనుభవిస్తున్న క్యాబినెట్ హొదా కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మహిళా కమిషన్ ఇద్దరు తమ టికెట్ల కోసమే తప్ప ప్రజలు పట్టించుకోవడం లేదు వారు అనుచరులు అనేక అక్రమాలకు పాల్పడుతున్న చూసి చూడనటు వ్యవహరిస్తున్నారు. సునీత రెడ్డి దమ్ముంటే మహిళ కమిషన్కు రాజీనామ చేసి తిరగాలి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ డిక్లరేషన్,యూత్ డిక్లరేషన్ లో చెపిన ప్రతి అంశం అమలుచేస్తుము అన్నారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి బ్లాక్ అధ్యక్షులు శ్రీనివాస్ రేడ్డి కౌడిపల్లి మండలం అధ్యక్షులు శ్రీనివాస రావు తునికి ఎంపీటీసీ పాషా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్ సింగ్, ఎంపీటీసీ పాషా,కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్ రెడ్డి,లింగం,పాషా,నర్సింలు, పుల్ సింగ్, గ్రామ అధ్యక్షులు సత్యనారాయణ, మల్లేష్, శ్రీనివాస్ గౌడ్,పోచయ్య, పత్రాల శ్రీనివాస్ గౌడ్, వీరా గౌడ్,ప్రభు,సోఫీ,బాల్ సింగ్, బద్దు, అరవింద్,పర్వతాలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ వైస్ ఎంపిపి భర్త మోహన్ నాయక్ బీఎస్పీ గూర్చి తెలుసుకో

- మన వాళ్ల భవిష్యత్ ను పణంగా పెట్టి నీకు.ఇచ్చింది వ్యాపారాలు చేయడాని కాదు
- అమాయకులను మభ్య పె ట్టి దందాలు రియల్ ఎస్టేట్ లు తప్ప ప్రజలకు మీరు ఎం చేశారు.
- మీకు అవకాశం ఇచ్చింది పేదల భూముల తో వ్యాపారాలు చేయడానికి కాదు
- అమాయకుల దగ్గర గుంజుకుని వెయ్యి సార్లు అమ్మినా ఆ భూమి పేదలదేగుర్తుంచుకో.
- బీఎస్పీ పార్టీ అధ్యక్షులు రాచమల్ల జయసింహ.



**శంషాబాద్.(ప్రశ్న న్యూస్) :** మహనీయుల చరిత్ర తెలుసుకుంటే బిఎస్పీ పార్టీ విలువ తెలుస్తుంది అని బాబా సాహెబ్ అంబేద్కర్ త్యాగాలు చేసి మనకు ఇచ్చిన రేసర్వేషన్స్ లో గెలిచింది మనవాళ్ళ భవిష్యత్తు పణంగా పెట్టి వ్యాపారాలు చేయటానికాఇప్పటికైనా మారండి పేదల పక్షాన నిలబడాలి అని రాజేంద్ర నగర్ బిఎస్పీ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు రాచమల్లు జయసింహ అన్నారు.శంషాబాద్ మండల వైస్ ఎంపిపి భర్త బిఆర్ఎస్ నాయకుడు మోహన్ నాయక్ నిన్న మీడియా తో బహుజన సమాజ్ పార్టీ గురించి చులనకగా మాట్లాడిన తీరును బిఎస్పీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాచమల్ల జయసింహ తీవ్రంగా కండించారు. మోహన్ నాయక్ గారు ముందు మహనీయులు జ్యోతిరావు పులే , సంత్ సేవాలాల్ , బాబా సాహెబ్ అంబేద్కర్ , మాన్యవార్ కాన్షి రాం గార్ల త్యాగాల చరిత్రను తెలుసుకోవాలని ఆ తరువాతనే బహుజన సమాజ్ పార్టీ గొప్పతనం తెలుస్తుంది అన్నారు. బాబా సాహెబ్ నలుగురు పిల్లలను కూడా పోగొట్టుకుని మన జాతులకోసం ఎంతో త్యాగం చేసి ఈ దేశానికి ఇచ్చిన రాజ్యాంగం ద్వారా రిసర్వేషన్ కల్పించింది మీలాగా అవకాశాలు పొంది తమ జాతి పేద ప్రజల బ్రతుకుల తో వ్యాపారం చేయటానికేనా అని ప్రశ్నించారు. మీరు జాతికి ఏం చేస్తున్నారనేది మీరు ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. బిఎస్పీ పార్టీ 40 ఏండ్ల చరిత్ర కలిగిన పార్టీ అని మర్చిపోవద్దన్నారు , ఉత్తరప్రదేశ్ లో లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర బిఎస్పీ పార్టీధి కానీ ఇక్కడ బీఆరేస్ పార్టీ బదుగు బలహీన వర్గాల ప్రజలకు ఆనాడు ప్రభుత్వాలు ఇచ్చిన భూములను అమాయకులను చేసి మభ్య పెట్టి భయ బ్రాంతులకు గురి చేసి దళారులుగా మారి మొదట ఇతరులకు అమ్మించి తరువాత బాగస్వాములు గా చేరి రియల్ ఎస్టేట్ దందా చేయటం తప్ప పేదలకు మీరు ఏం చేశారు అని అడిగారు. మదనపల్లి గిరిజన రైతులదీ అసైన్డ్ భూమి దీనిని మీరు రైతుల దగ్గర లాక్కుని వెయ్యి సార్లు అమ్మినా చట్ట ప్రకారం మళ్ళీ రైతులకే వస్తుంది ఆవిదంగా బిఎస్పీ పార్టీ గిరిజన రైతులకు అండగా ఉంటుందని అడ్డు వచ్చినవారి అసలు రూపం ప్రజల ముందు బట్ట బయలు చేస్తామని వారికి ప్రజలే బుద్ధి చెప్తారని జయసింహ అన్నారు. దుకాణం మాది కాదు ఇక మీ దుకాణాలు బంధయ్యే సమయం అసన్నమైందని ప్రజల పక్షాన నిలబడి ప్రజలకు సేవ చేస్తే మంచిదని లేదంటే చరిత్రలో మీరు చెడ్డ పేరు తెచ్చుకున్న వారీగా మిగిలిపోతారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు యపచెట్టు యాదగిరి, రాచమల్ల రాజ్ కుమార్, చిన్నగండు భాస్కర్, మంగలారం సాయి పాల్గొన్నారు.

## రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో బిజెపిలో భారీగా చేరికలు



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్):** రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని శంషాబాద్ మండల్ పెద్ద షాపుర్ గ్రామం మరియు షాపూర్ తండా నుంచి సుమారు 100 మంది కార్యకర్తలు, ఇతర పార్టీ నాయకులు, బీజేపీ పార్టీ అభిమానులు హుజురాబాద్ శాసన సభ్యులు, చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ సమక్షంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా పార్టీలో చేరడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ వారికి పార్టీ కండువా వేసి పార్టీ లోని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసమే ఆనాడు పార్టీ మారుతున్ననని మాయమాటలు చెప్పిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వల్ల ఇప్పటివరకు రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరుగలేదని ఆరోపించారు . ప్రకాష్ గౌడ్ అతని అనుచరుల అవినీతి, భూకబ్జాలు రోజురోజుకుఎక్కువయ్యాయని ఆరోపించారు. సంక్షేమ పథకాలు కూడా అర్హులకు కాకుండా ఎమ్మెల్యే అనుచరులకు, బంధువులకు ఇచ్చుకుంటు ప్రజలను గాలికొదిలేశారని హెద్దేవా చేశారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కేసీఆర్ ను నిధులు అడిగే దైర్యం లేక కార్పొరేటర్ల నిధులతో జరిగే అభివృద్ధి పనుల శంకుస్థాపనల ఫోటోలకు ఎమ్మెల్యే ఫోజులు ఇస్తున్నాడనీ అన్నారు. ఈ 9 ఏళ్లలో రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కేంద్రం ఇచ్చిన నిధులు మరియు ప్రజలు కట్టిన పన్నులతోనే జరిగింది తప్ప ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.అలాగే కేసీఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా అప్పుల పాలైందని రానున్న ఎన్నికల్లో కేసీఆర్ మరియు బీ. అర్.ఏస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పి భారతీయ జనతా పార్టీని గెలిపించాలని ప్రజలు ఇప్పటికే డిసైడ్ అయ్యారు శ్రీనివాస్ రెడ్డి సూచించారు.దేశంలో సుపరిపాలన అందిస్తున్న మోడీ గారి విధానాలకు ఆకర్షితులై బీజేపీ పార్టీతోనే తెలంగాణ మరియు రాజేంద్ర నగర్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని నమ్మి భారతీయ జనతా పార్టీకి మద్దతు తెలిపేందుకు యువకులు, నాయకులు, ప్రజలు భారీ ఎత్తున బిజెపి పార్టీలో చేరుతున్నారు. రానున్న ఎన్నికల్లో రాజేంద్ర నగర్లో బీజేపీ పార్టీ విజయం సాధించడం ఖాయమని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీనీ గ్రామ బూత్ స్థాయి నుంచి సంస్థాగతంగా అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కష్ట పడి పనిచేయాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పని చేయాలని కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం లో భారతీయ జనతా పార్టీ భారీ మెజార్టీ తో విజయం సాధించి భారతీయ జనతా పార్టీ జెండా ఎగరడం ఖాయమని కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేయడం జరిగింది. బి ఆర్ ఎస్ కాంగ్రెస్ పార్టీ లో నుంచి చేరిన ముఖ్య నాయకులూ బ్యాంకు ఎలక్షన్ డైరెక్టర్ నర్సిమ్మ ఎంపీటీసీ రమేష్ శ్రీకాంత్ మహేందర్ యాదవ్ (ఎంప్లాయ్ యూనియన్ ) శివ లాల్ బాలు రాజేందర్ హన్మంత్ మలేష్ వెంకటేష్ మరియు యూత్ లీడర్ లు యువకులు ఈ కార్యక్రమంలో ముఖ్య బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మణ్ గారు తలపల్లి నందు ,రమేష్ కళ్యాణ్ రెడ్డి తలరి చినా బుచ్చిరెడ్డి లవ్ ఎల్ వి రెడ్డి పాండు యాదవ్ శ్రీకాంత్ మన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ జన్మదిన వేడుకలు



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్) :** మండల పరిధిలోని పెద్దగోల్కొండ గ్రామానికి చెందిన యువ నాయకుడు,నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ని ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు అనంతరం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ శ్రీకాంత్ గౌడ్ రాబోయే రోజులలో రాజకీయంగా మరింత ఉన్నత పదవులు అలంకరించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో ( గౌడ్,సి. హెచ్.శ్రీనివాస్,వెంకటేష్,దేవేందర్,బిక్షపతి,సంతోష్,హనుమంతు,అరుణ్,రాఘవేందర్,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత నైపుణ్యం తో ముందడుగు వేస్తే ఎంతో ఉపయోగం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్) :** యువత నైపుణ్యత తో ముందడుగు వేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.శంషాబాద్ పురపాలక పరిధి లోని రాల్లగుడా లో మంగళవారం విజేత సూపర్ మార్కెట్ పైన నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఏ స్కిన్ ఎయిర్ క్లినిక్ ను పురపాలక చైర్ పర్సన్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ యువత నైపుణ్యం తో ముందడుగు.వేస్తే మంచి ఉపయోగం ఉంటుందని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు, కార్యక్రమంలోవైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ , కౌన్సిలర్లు పుష్పలత బుచ్చిరెడ్డి , మేకల వెంకటేష్ ముదిరాజ్ , ఆయిల్ కుమార్ , కో ఆప్షన్ మెంబర్లు కవిత ప్రసాద్ , అస్లామ్ తెరాస నాయకులు బండి శ్రీకాంత్ యాదవ్ , ప్రభాకర్ , మరియు సీనియర్ నాయకులు, యువనాయకులు, కార్యకర్తలు, తదితరులు.

## మహిళ సంక్షేమం పై సీఎం కేసీఆర్ కు ప్రత్యేక శ్రద్ధ.



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్) :** మహిళ సంక్షేమం పై సీఎం కేసీఆర్ కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందువల్లే అయన అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి రంజిత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్ర నగర్ లోని జి అర్ కే ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్ లను పరిశీలించి, అనంతరం చిన్నారులచే ప్రదర్శించబడిన నాట్య ప్రదర్శన ను తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీరంజిత్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ మహిళలు గౌరవించబడతారో, అక్కడ దేవతలు పూజించబడతారాన్నారు.సీఎం కేసీఆర్ కు మహిళల పట్ల అమిత గౌరవం ఉందని, అందుకే మహిళ సంక్షేమం కోసం అయన తీవ్ర కృషి చేసి, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. సమాజంలో మహిళలు లేక పోతే మనిషి జననం లేదు, మననం లేదు, గమనం లేదు, మనిషి జీవితానికే గమ్యం లేదన్నారు. ఒకనాడు మహిళ లకు రక్షణ ఉండేది కాదని, నేడు మహిళలు సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం షీ టీం లను తీసుకు వచ్చిందన్నారు. బిడ్డ కడుపు లో పడ్డ మొదలు నుంచి పండు ముసలి వరకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కేసీఆర్ కిట్ మొదలు ఒంటరి మహిళలకు పెన్షన్ లు,ఆసరా పెన్షన్ లతో ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ కు మహిళ సంక్షేమం పట్ల చాలా కమిట్ మెంట్ ఉందన్నారు. మహిళలు ఇంట్లో అన్ని బాధ్యతలు చూడటంతో పాటు పిల్లలకు వ్యక్తిగత క్రమశిక్షణ నేర్పించాలన్నారు. చదువు పట్ల ఉన్న శ్రద్ధతో తన తల్లి తనను చదివించడంతో తాను ఈ స్థాయిలో ఉన్నానని తెలిపారు. తల్లితండ్రులకు తమ పిల్లలకు ఎక్కువ కంఫర్ట్స్ ఇవ్వకుండా, వారి సొంత కాళ్ళ పై నిలబడేలా తయారు చేయాలన్నారు. స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అని, తన నియోజక వర్గాలలో ఎక్కువ మంది ప్రజా ప్రతినిధులు మహిళలే ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోనే ఎక్కువ మంది ప్రజా ప్రతినిధులు మహిళలు ఉండటం విశేషమన్నారు. మహిళ బిల్లు కోసం తమ పార్టీ తరపున ఎం ఎల్ సి కవిత ఢిల్లీలో పోరాటం చేసిందనిగుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకున్నా మహిళ సంక్షేమం కోసం తాము అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టామని వివరించారు. అనంతరం పలువురు లబ్ది దారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు మహిళా.సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు పెద్దాయనా ఆశిర్వాదాం దక్కింది లాస్యనందిత



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్ ) :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే దివంగత నేత సాయన్న వారసులు ఎట్టి కెలుకు సిఎం కేసిఆర్ ని నిన్నగద్వాల్ లో ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రారంభోత్సవం లో కలిశారు.దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సాయన్న మరణంతో శోకసంద్రంలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాల్సిన వాళ్ళే ప్రభుత్వ కారిక్రమాల్లో అడ్డుకోవడం, కొన్ని సందర్భాల్లో వారిని కార్యక్రమాలకు ఆహ్వానించికపోవడం సాయన్న కుటుంబంచాలా ఇబ్బందులు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొంత కాలంగాతండ్రి బాటలో నడుస్తూ, కంటోన్మెంట్ ప్రజలతో మమేకమై వారి ఆత్మస్థైర్యం పెంచుకుంటూ ప్రజల్లో దూసుకుపోయారు.నియోజకవర్గంలో అందరూ ఇబ్బంది పెట్టిన పట్టించుకోకుండా చివరికి వంటరిగా సిఎం కేసిఆర్న్ని కలిసి కాసేపు ముచ్చటించారు.ఏదేమైనా సిఎం కేసిఆర్ ని కలిసిన తర్వాత సొంత వాళ్లల్లో గుసగుసలు మొదలయ్యాయి దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సాయన్న వారసులకు నిన్న సిఎం కేసిఆర్ ని కలిసిన విషయం జీవితం లో చిరస్మరణీయంగా నిలిచిపోయేదని బిఆరెఎస్ నాయకురాలు నివేదిత లాస్యనందిత పేర్కొన్నారు.

ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
జూన్ 14/శుక్రవారం/2023

## బోయిన్ పల్లి మార్కెట్ అభివృద్ధి కి ప్రతిపాదనలు సిద్ధం చేసిన కమిటీ



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్ ) :** డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిన ఉన్నత శ్రేణి అధికారి ఎల్ శ్రీనివాస్.ఈ సమావేశం లో ఛైర్ పర్సన్ రాగిరి హారిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ముఖ్యంగా బోయిన్ పల్లి మార్కెట్ యార్డు లో గత కొంత కాలంగా స్త్రీ, పురుషుల మరుగుదొడ్లు అత్యంత దారునంగా ఉండడం గమనించిన ఛైర్ పర్సన్ రాగిరి హారిక అసహనం వ్యక్తం చేశారు.ఇంత పెద్ద మార్కెట్లో కనీసం మౌళిక వసతుల పై ఫోకస్ ఎందుకు చేయలేదని అధికారులను నిలదీసిన సందర్భాలు ఎన్నో.నిత్యం యార్డు కి సుమారు ఇరవై వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.దేశంలోనే నెంబర్ వన్ గా గుర్తింపు పొందిన కూరగాయల మార్కెట్. అలాంటి గొప్ప మార్కెట్లో టాయిలెట్స్ లేకపోవడం దురదృష్టకరం.గత నెల అత్యవసరంగా ఉన్నత శ్రేణి అధికారి ఎల్ శ్రీనివాస్ తో భేటీ అయిన ఛైర్ పర్సన్ మార్కెట్లో శౌచలయం ఎందుకు అధ్వానంగా ఉన్నాయి .వెంటనే త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని కోరగా, నిన్న బోయిన్ పల్లి మార్కెట్ కార్యాలయం లో సమావేశం అయిన పాలకమండలి మహిళలకు, పురుషులకు సంబంధించిన బహిర్భూమి, షాపు ల ముందు రేడియం లైన్స్, పార్కింగ్ స్థలం లో వాహనాలు పార్కింగ్ చేయడానికి వారికి కేటాయించిన స్థలంలో (హైచర్, టాటా ఏసీ )కంచె వెయ్యాలని ప్రతిపాదనలు, అలాగే పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.అలాగే వీటిన్నింటికి సంబంధించిన సుమారు ఎనభై లక్షల రూపాయలు ప్రతిపాదనలు సిద్ధం చేసి మార్కెటింగ్ శాఖ సంచాలకులకు(డైరెక్టర్) పంపుతున్నట్లు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి అధికారి ఎల్ శ్రీనివాస్ వెల్లడించారు.ఇక ముందు మార్కెట్ యార్డు లో దఫాలు వారిగా సమస్యలు పరిష్కారం అవుతాయని, అలాగే వేయింగ్ బ్రిడ్జి కూడా మరమత్తులు చేసి అందుబాటులోకి తీసుకువస్తామని గ్రేడ్ వన్ అధికారి ఎల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ రాగిరి హారిక, మార్కెట్ సెక్రటరీ ఎల్ శ్రీనివాస్,గ్రేడ్ త్రీ మహ్మద్ కాజా, వైస్ ఛైర్మన్ చింతల వేణు గోపాల్ రెడ్డి, సభ్యులు మేడిశెట్ట గిరిధర్,రామకృష్ణ , భాస్కర్ ముదిరాజ్ , షేక్ నయిం, జీవకన్ మీనా భాస్కర్, దేవులపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్,సుషాంత్ రెడ్డి, గౌతం చంద్,బి.నారాయణ ,శ్రీరాముల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కెవీఆర్ నువ్వు కెవ్వు కేక

## పార్కింగ్లో పరిషాన్ చేస్తున్న "బీ" 27

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్ ) :** డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కూరగాయల మార్కెట్లో నిత్యం ఏదో ఒక చోట కమీషన్ ఏజెంట్లు తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్ యార్డు భూ విస్తీర్ణం సుమారు ఇరవై మూడు ఎకారాల్లో ఉంది.2002 లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నూట పద్నాలుగు దుకాణాలు అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు.(ప్రొవిజన్స్ )గ్యేన్ట్రైడర్స్ కి ముప్ఫై షాపులు కేటాయించారు.ఇక్కడికి పూర్తైనా లెక్క నూట నలప్ఫై నాలుగు.మార్కెటింగ్ శాఖ నిర్మించిన దుకాణాల యజమానులు, రైతులు, కొనుగోలు దారులు ఎవ్వరికీ ఇబ్బందులు తలెత్తకుండా విశాలమైన పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు.మరో గమ్మతైన విషయం ఏమిటంటేతనుదూరె సంధు లేదు గానీ మేడకొ డోలు అన్నట్టుంది బోయిన్ పల్లి మార్కెట్ యార్డు పరిస్థితి.ఎందుకంటే ముందు వెనుక చూడకుండా మరో ముప్పై తొమ్మిది మంది కి లైసెన్స్ జారీ చేశారు 2012లోవారిలో అంతర్గత గొడవలే కాకుండా,నూట నలభై నాలుగు మందికి ఎలా అయితేఉచితంగా కేటాయించారో అదే విధంగా 39 మందికి కిరాయి ఆరు వేల రూపాయలు అంశాన్ని తొలగించాలనే డిమాండ్ తో కోర్టు మెట్లు ఎక్కారు.ఈ విషయం పై పూర్తి అవగాహన ఉన్న అధికారులు న్యాయ స్థానములో ఉన్న అంశం తెలెదాక వ్యాపారం లావాదేవీలు నిర్వహించకుడదని చెప్పాల్సిన అధికారులు వారిచ్చే కాసులకు దాసోహం అయ్యి, మిగితా కమీషన్ ఏజెంట్లు ఇస్తున్న తాయిలాలకు తల ఊపుతూ మార్కెట్ కి తలనొప్పిగా మారడానికి అధికారులే




కారణం.ఇక అసలు విషయానికి వస్తే జెవిఆర్ కమీషన్ ఏజెంట్ కెవీఆర్ పై పలు ఆసక్తికరమైన విషయాలు బహిర్గతం చేశారు.అవి ఏమిటంటే పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో ముల ఉన్న దుకాణాల పై క్యాబిన్ లో ఎంట్రీ, ఆపై పార్కింగ్ లో వ్యాపారం అది తన షాపు ముందు ఉన్న పార్కింగ్ స్థలం లో కుర్చీ వేసుకుని మరి వ్యాపార లావాదేవీలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారుజెవిఆర్ షాపు నెంబర్ బీ 28 యాజమాని హనుమంతు రావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరో విషయం కమీషన్ ఏజెంట్లకు కేటాయించిన దుకాణాల ముందు నడిచి వెళ్ళే మెట్లు కూడా కెవీఆర్ రాంరెడ్డి నలప్ఫై వేల రూపాయలకు కిరాయికి ఇచ్చి అందరికీ ఇబ్బందులు గురి చేస్తున్నాడు.హస్యస్పదంఏమిటంటే మార్కెట్లో జరుగుతున్న భాగవతం ఉన్నత శ్రేణి అధికారి కి అలాగే పాలకమండలికితెలుసు.బాధలు విని బాధ్యత గా వ్యవహరించాల్సిన అధికారులే నిమ్మకు నిరెత్తకుండా వ్యవహరించడం దురదృష్టకరం . పలు సందర్భాల్లో కెవీఆర్ రాంరెడ్డి నీచేసే వ్యాపారం సరైనది కాదని తెలియాజేసిన, నీకేంటి నువ్వారు, నీకేం సంబంధం,నాఇష్టమొచ్చినట్లు వ్యాపారం నిర్వహిస్తాను .నా వ్యాపారం ఆపడం ఎవ్వరితరం కాదు, ఎవరికి ఎం ఇవ్వాలో , వారికిఅందుతుంది, అందుకే నావైపు తొంగి చూడరు. అలాగే నా వెనక అధికారులు ఉన్నారంటూ గంభీరంగా హెచ్చరించారని జెవిఆర్ షాపు యజమాని హనుమంతు రావు వెల్లడించారు.ఆ నోటి ఈ నోటామొత్తానికి సెక్రటరీ దృష్టి కి చేరడంతో కెవీఆర్ రాంరెడ్డి నీ పిలిచి వివరణ కోరగా, సార్ నేను ఒక్క వాహనం తో వ్యాపారం చేస్తున్నాను,ఆయన చేసే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.కానీ అధికారులు మాత్రం ఇరువురిపై గుర్రుగా ఉన్నట్లు సమాచారం.ఏదేమైనాబోయిన్పల్లి మార్కెట్లో అంతా అవినీతి దందా జోరుగా సాగుతోంది అయిన కూడా ఎవ్వరూ స్పందించక పోవడం బాధాకరం , లాస్ట్ కమీషన్ ఏజెంట్లు లాస్ తో వ్యాపారం చేస్తూ కంట తడి పెట్టిన కనకరించని అధికారులు

## పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా (ప్రశ్న న్యూస్) :**మీర్ పేట్, హెచ్ బి కాలనీ డివిజన్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్ ఆహ్వానం మేరకు పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు భారాస రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ టీచర్ మరియు ఆయా లేకపోవడంతో పాఠశాల సిబ్బంది విజ్ఞప్తి చేయడంతో వెంటనే స్పందించిన బి ఎల్ అర్ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారిని నియమిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి,బి ఎల్ అర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి,వెంకన్న గౌడ్, తిరుమల నగర్ కాలనీ అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, దూసరి నవీన్ గౌడ్, చారి, నరసింహ, కుమార్, మనీష్ ,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**కోయిలకొండ (ప్రశ్న న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు నేడు అత్యంత ఉన్నత స్థాయిలో ఉన్నారని కోయిలకొండ మండల పరిదిలోని సూరారం గ్రామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి అన్నారు. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభమైన సందర్భంగా అమె మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యాభోదన జరుగుచున్నదని దీనితో విద్యార్థుల మేధోశక్తిపై అధిక భారం పడదని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడు బి.రాంమోహన్ మాట్లాడుతు మారుమూల ప్రాంతాల ప్రజలు తమ పిల్లల చదువుల కోసం కార్పోరేట్ స్కూల్ చుట్టు తిరగాల్సి వస్తుంది కాని ప్రభుత్వ పాఠశాల సిబ్బంది మాత్రం విద్యార్థులకు అన్నివేళలో అందుబాటు ఉంటు విద్యార్థులకు కార్పోరేట్ చదువులకు దీటుగా విద్యాభోదన చేయుటలో ముందున్నారని దీనికి నిదర్శనమే ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో పెరిగిన ఉత్తీర్ణతా శాతమని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్ లతో పాటు స్కూల్ డ్రెస్ లను



ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యాప్రమాణాలను పెంచి 12 రకాల వసతులతో తీర్చి దిద్దనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమని, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేయాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పుష్పకుమారి, కిషన్, సత్యనారాయణ, వెంకట్రాముడు, చంద్రప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు. అనంతరం బి.రాంమోహన్ అద్వర్యంలో విద్యార్థులకు చాక్లెట్స్, మిఠాయిలు పంచారు.

## అరుదైన మే పుష్పం

**వెంకటాపురం(ప్రశ్న న్యూస్ ) :**ములుగు జిల్లా వెంకటాపురం పట్టణం నేలారి పేట వీధిలో రైతు శుద్ధపల్లి సత్యనారాయణ పటేల్ స్వగృహం ఆవరణలో వికసించిన మే పుష్పాలు మరికొన్ని పుష్పాలు. మొగ్గతొడికి విస్తరిస్తుండగా అందమైన పూలకు ఏ విధమైన హాని జరగకుండా ఐరన్ మెస్ ఏర్పాటు చేశారు. అరుదైన ఈ పుష్పాలను తిలకించి వారి ,వారి చరవాణిలలో పలువురు బంధిస్తున్నారు. ప్రకృతి రమణీయ ఆహ్లాదకరమైన, మే పుష్పాలు జూన్ నెలలో వికసించడంతో



పలువురు ఆసక్తిగా తిలకించి తమ తమ చరవాణిలలో ఈ అపురూపమైన పుష్పాలను బంధిస్తున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

**నెల్లూరు బ్యూరో ( ప్రశ్న న్యూస్) :**మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గూడూరు టూ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని సిఐ అన్నారు.గూడూరు పట్టణంలోని కోర్ట్ సెంటర్ సర్కిల్ వద్ద సిఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, బండి రికార్డు లేని వాహనాదారులకు జరిమానా విధించారు. టూ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూప్రతి వాహనదారుడు తప్పనిసరిగా బండి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు.



గూడూరు పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. రోడ్డు నియమాలు పాటించకపోతే జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా వాహనదారులు విధిగా వాహన పత్రాలతో పాటు లైసెన్స్ ను ప్రయాణ సమయంలో వారి వద్ద ఉంచుకోవాలని తెలిపారు . వాహనాల తనిఖీ సమయంలో వాటిని పోలీసులకు చూపాల్సిన అవసరం ఉంటుందని గుర్తు చేశారు. రోడ్డు నియమాలు పాటించి సహకరించాలని కోరారు.

# ఏపీలో ఎవరు ఎవరిని ట్రాప్ చేస్తున్నారు..?

**- చంద్రబాబు భేటీ పర్యవసానమా.?**

జూన్ 3న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బీజేపీ టాప్ బాస్ అమిత్షా, ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాలను కలిశారు. తెలుగుదేశం పార్టీకి శాశ్వతంగా తలుపులు మూసేస్తున్నామని నాలుగేళ్ల కిందట ప్రకటించిన అమిత్షాతో కలవడమే ఒక విశేషం అయితే.. స్వయంగా బీజేపీ నేతలే తెలుగుదేశం అధ్యక్షుడిని ఆహ్వానించడం మరో కీలకాంశం. సరిగ్గా ఏపీలో బీజేపీ అగ్రనేతల పర్యటనలకు ముందు భేటీ జరగడం బీజేపీ వాయిస్లో మార్పు రావడం చూస్తుంటే చంద్రబాబు భేటీ సక్సెస్ అయినట్లే అనుకోవాలి. ఎందుకంటే ఇప్పటి వరకూ వైసీపీపై బీజేపీ స్థానిక నేతలు ఏదో చేయాలి కాబట్టి చేస్తున్నట్లు విమర్శలు చేసినా కేంద్రం నుంచి ఆ స్థాయిలో విమర్శల వాడి ఎప్పుడూ లేదు. కానీ నడ్డా, అమిత్ షా పర్యటనలు "టార్గెట్ వైసీపీ" అన్నట్లుగా సాగాయి. నిర్దిష్టమైన ఆరోపణలు చేశారు ఇద్దరు నేతలు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చారు అనడం దగ్గర నుంచి 'కాబోయే రాజధాని' వైజాగ్ ను నాశనం చేశారు అనడం వరకూ ప్రత్యేకమైన లక్ష్యం కనిపిస్తోంది. ఇంతకు ముందు బీజేపీ సభల్లో టీడీపీపైన కూడా విమర్శలు ఉండేవి. కానీ ఇప్పుడు అవి లేవు. ఎక్కడా టీడీపీ గురించి మాట్లాడలేదు.

**- అమిత్ షా పై ఆచితూచి**

వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు వచ్చినా సరే.. ఆ పార్టీ నేతలు తీవ్రంగా విరుచుకుపడుతుంటారు. పవన్ కల్యాణ్, చంద్రబాబుపై స్పందించడానికి కొంతమంది ఎంపిక చేసిన నేతలున్నారు. కానీ ఈసారి విమర్శలు చేసింది కేంద్ర హోం మంత్రి కావడంతో కాస్త జాగ్రత్తగానే ఉన్నారు. అమిత్ షా పర్యటన మరుసటి రోజే జగన్ క్రోసూరు బహిరంగసభలో పాల్గొన్నారు. చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేసిన ముఖ్యమంత్రి.. అమిత్ షా తనపై నేరుగా చేసిన ఆరోపణలపై మాత్రం మాట్లాడలేదు. పైగా బీజేపీ కూడా తమకు దూరమైందన్న ధోరణితో మాట్లాడారు. ఇన్నాళ్లు బీజేపీ అండ ఉంది ఇప్పుడు అది కూడా లేదు.. తాను ఒంటరి వాడినన్న భావం ఆయన మాటల్లో వ్యక్తమైంది. సౌమ్యంగా స్పందించే వైవీ సుబ్బారెడ్డి ముందుగా బీజేపీపై మాట్లాడగా.. మంత్రి గుడివాడ అమర్ బీజేపీని నొప్పించని రీతిలో రియాక్ట్ అయ్యారు. ప్రత్యర్థులపై మాటల దాడులు చేసే నేతలు ఎవ్వరూ ఈ సారి బయటకు రాలేదు.

**- టీడీపీ కూడా అంతే అప్రమత్తంగా**

వరుసగా రెండు రోజులు జరిగిన పరిణామాలపై టీడీపీ కూడా పెద్దగా రియాక్ట్ కాలేదు. బీజేపీ చేసిన విమర్శలకు మద్దతుగా కానీ దానిపై స్పందనగా కానీ ఎవరూ మాట్లాడలేదు. అంతర్గతంగా మాత్రం.. నాలుగేళ్ల తర్వాత వైసీపీ అరాచకాలు గుర్తొచ్చాయా అన్న వ్యాఖ్యలు వచ్చాయి. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీతో కలిసి వెళ్లడం అంత మంచిది కాదన్న భావన పార్టీ నేతల్లో ఉంది. అయితే 2019 కు ముందు బీజేపీని ఎదిరించి తప్పు చేశామన్న భయం కూడా ఉంది. కేంద్రంలో అధికార పార్టీ సహకారం లేకపోతే ఎన్నికల్లో నెగ్గడం కష్టమన్న భావన పార్టీ అధినాయకత్వంలో ఉంది. "ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీతో కలిసినా నష్టమే కలవకపోయినా నష్టమే ఏ నష్టం తక్కువో చూసుకుని మేం ముందుకు వెళ్లాల్సి ఉంది." అని ఆ పార్టీ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

**- ఎవరి ట్రాప్లో ఎవరున్నారు.? బీజేపీని నమ్మొచ్చా.**

రాజకీయ గండరగడలైన మోదీ- షా గురించి పూర్తిగా తెలిసిన తెలుగుదేశం ఒక్కసారిగా మారిన ఈ పరిస్థితి తమకు అనుకూలం అని నమ్మే పరిస్థితి లేదు. ఎందుకంటే ప్రధాని- ముఖ్యమంత్రి మధ్య మంచి సంబంధాలు ఉన్నట్లు అనేక సందర్భాల్లో రుజువైంది. స్థానిక బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్ని ఆరోపణలు చేసినా కేంద్రం నుంచి రావలసిన సాయం.. అవసరమైన మద్దతు అనేక సందర్భాల్లో వివిధ రూపాల్లో అందిన విషయం స్పష్టం. రాష్ట్రం అప్పులమయం అయిపోయిందని బీజేపీ కేంద్ర, రాష్ట్ర నేతలు తరచుగా ఆరోపిస్తూనే ఉంటారు. కానీ మరిన్ని అప్పులు చేసుకోవడానికి వెసులుబాటు ఆ కేంద్రం నుంచే వస్తోంది. మొన్నటికి మొన్న కూడా కేంద్రం వద్ద ఎప్పటి నుంచో పెండింగ్ లో ఉన్న రెవిన్యూ లోటుకు సంబంధించిన నిధులు 10వేల కోట్లు రాష్ట్రానికి వచ్చాయి. పోలవరం ప్రాజక్టుకు సవరించిన అంచనాలకు ఆమోదం దొరికింది. 12 వేల కోట్ల నిధులు ఇచ్చేందుకు అంగీకారం అయింది. కేంద్రంతో సత్సంబంధాలు లేకుండా ముఖ్యమంత్రి ఇవి సాధించలేరు. బీజేపీలో చేరిన టీడీపీ నేతల ట్రాప్లో ఆ పార్టీ పడిపోయిందని వైసీపీ విమర్శలు చేస్తోంది కానీ.. జాగ్రత్తగా పరిశీలిస్తే.. ఇందులో బీజేపీ వ్యూహం ఏమైనా ఉందా అన్న అనుమానం రాక మానదు. టీడీపీని పర్మనెంట్గా దూరం చేస్తామన్న బీజేపీ అంత తొందరగా మనసు మార్చుకుందా.. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న జగన్ మోహనరెడ్డిని అంత ఈజీగా దూరం పెట్టేస్తోందా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలోనూ.. కేంద్రంలోనూ రాజకీయ పరిస్థితులు మారుతున్న విషయం వాస్తవం. కర్ణాటక ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నెమ్మదిగా పుంజుకుంటోంది. ఏదైనా తేడా వస్తే.. నమ్మకమైన భాగస్వామ్య పక్షం అవసరం. అందకనే %చీణూ% లో చేరాల్సిందిగా ఎప్పటి నుంచో వైసీపీపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. మైనార్టీలు, దళితులే తన పార్టీకి బలం అని బీజేపీతో కలిస్తే.. ఇద్దరం నష్టపోతామని చెబుతూ జగన్ ప్రతీ సందర్భంలోనూ దాటవేస్తూనే వస్తున్నారు. జగన్ ఎన్డీఏలో చేరడం లేదన్న కారణంతో చేస్తున్నారా.. లేక రాష్ట్ర ప్రభుత్వంపై కూడా వ్యతిరేకత ఉందన్న నిర్ధారణతో, తెలుగుదేశం అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్న అంచనాతో చేస్తున్నారా అన్నది అంతుబట్టడం లేదు. ఇంకో అవకాశాన్ని కూడా రాజకీయ విశ్లేషకులు ఊహిస్తున్నారు. తెలుగుదేశం ట్రాప్లో బీజేపీ పడటం కాదు. బీజేపీ- వైసీపీ కలిసే తెలుగుదేశాన్ని ట్రాప్ చేస్తున్నాయా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో బీజేపీ ఎదగాలంటే.. తెలుగుదేశం పార్టీ బలహీనం అవ్వాలి. ముఖ్యమంత్రి జగన్ కొన్ని నెలలుగా తాను ఒక్కడినే అంటూ ఒంటరి గీతాన్ని ఆలపిస్తున్నారు. దానికి మద్దతుగా ఇప్పుడు బీజేపీ కూడా విమర్శలు మొదలుపెట్టింది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసు జగన్ ముంగిటే ఉంది. పాత కేసులు ఎలాగూ ఉన్నాయి. వీటి ద్వారా ఒత్తిడి పెంచితే అందరూ కలిసి జగన్ ను వేధిస్తున్నారన్న భావన క్రియేట్ అవుతుంది. అలాంటి పరిస్థితి కల్పించి జగన్కు సానుభూతి ఓట్లు కురుపించాలన్నదే బీజేపీ ఎత్తుగడ అనే అనుమానాలు కూడా ఉన్నాయి. రాజకీయ వ్యూహాలు పన్నడంలో దిట్టలైన మోదీ-షా మనసులో ఏముందో తెలీదు కదా వాళ్లు ఎలాంటి స్కెచ్ వేశారో ఇప్పుడప్పుడే తెలిసే అవకాశం లేదు. ఇప్పటికైతే బీజేపీని అంత తేలిగ్గా ఎవరూ నమ్మే పరిస్థితి లేదు.

## రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడుగా భానుక మల్లికార్జున్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్ ) :** రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు గా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బిజెపి సీనియర్ నాయకులు మల్లికార్జున్ నియమితులైనారు.కరీంనగర్ ఎంపీ, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీనియర్ నాయకులు మల్లికార్జున్, పరుశురాం పేర్లను ప్రకటించి నోరు తీపి చేశారు.బిజెపిలో కార్యకర్తగా ఉంటూ , పార్టీ కారిక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, రాష్ట్ర నాయకుల్లోతన కంటు ఓ ప్రత్యేక గుర్తింపు పొందారు.ఆ గుర్తింపె నేడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వొదతెచ్చిపెట్టింది అనుకోవచ్చు.ఏదేమైనా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో భానుక కుటుంబానికి ఓ ప్రత్యేకగుర్తింపు ఉండడం గమనార్హం.అలాగే ప్రజల మధ్య ఉంటూ కష్టసుఖాలను తెలుసుకుని ఏదైనా ఇబ్బందులు ఎదురైతే వేంటనే స్పందించి సమస్యలు తీరుస్తారు.భానుక మల్లికార్జున్ తనకు పెద్ద బాధ్యత తో కూడిన పనిని అప్పజెప్పినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల మధ్య ఉంటూ పార్టీ కి విధేయతగా ఉంటానన్నారు.ఈకార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి సీనియర్ నేత విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలి

**ఓజిలి( ప్రశ్న న్యూస్ ):**విద్యార్థి దశ నుంచే పాఠ్యాంశాలను ఇష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అని ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఇష్టపడి చదవాలని మండల విద్యాశాఖ అధికారిని శైలజ అన్నారు.ఓజిలి గ్రామంలోని అరుంధతి వాడ ఎలిమెంటరీ స్కూల్లో పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోళ్ల నారాయణ, మంగళ పూరి రవికుమారి,ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక కిట్లను ఓజిలి మండల విద్యాశాఖ అధికారిని శైలజా చేతుల మీదగా సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు వరం లాంటివని తెలిపారు. ప్రతి విద్యార్థీ జగనన్న విద్యా కానుక కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు కోసం కొన్నికోట్లు రూపాయలు ఖర్చు చేసి విద్యా కానుక కిట్లను అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలని ఆమె తెలిపారు.విద్యా




కానుక కిట్లో ప్రతి విద్యార్థికి ఉచితంగా ఇంగ్లిష్-తెలుగు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, 3 జతల యూనిఫామ్ క్లాత్ కుట్టు కూలితో సహా అందజేయడం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు 6-10 తరగతి పిల్లలకు ఆక్స్ఫర్డ్ ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ, 1-5 తరగతి పిల్లలకు పిక్టోరియల్ డిక్షనరీతో కూడిన విద్యాకానుక కిట్ ను స్కూల్ ప్రారంభమైన వదిన అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తోళ్ళ నారాయణ, మంగళ పూరి రవికుమారి, విద్యార్థిని విద్యార్థులు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచి పిల్లలకు యోగా నేర్పించండి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) :** జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్లో జూన్ 12వ తేదీ సోమవారం రోజున ఈ విద్యా సంవత్సరం ప్రారంభం పురస్కరించుకొని విద్యార్థులకు యోగా శిక్షణ పరిచయ క్లాస్ ఇంట్రడక్షన్ క్లాస్ యోగా గురువు సత్తయ్య చే ఇవ్వబడినది. అల్లే సత్తయ్య యోగా గురువు మన పాఠశాలకు వచ్చి దత్తత తీసుకొని యోగా అభ్యాసం ప్రాక్టీస్ చేయిస్తాను అని అనడం మన అదృష్టము వీరు ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు యోగా క్లాసు విద్యార్థులు తల్లిదండ్రులకు వారి కుటుంబ సభ్యులకు పరిచయం చేసి నిత్యం అభ్యాసం చేయించే ఏర్పాటు చేస్తానని పాఠశాల విద్యార్థులకు రెగ్యులర్గా ఉదయం 8:30 నుండి 9 గంటల వరకు యోగా క్లాస్ తీసుకుంటానని తెలిపినందుకు పాఠశాల కృతజ్ఞతాభివందనలు తెలుపుచున్నది అలాగే తల్లిదండ్రులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఆరోగ్యాలను మెరుగుపరచుకొని ఉండాలని జ్ఞాన భారతి కోరుచున్నది. జ్ఞాన భారతి స్కూల్ ప్రిన్సిపాల్ ప్రతిరోజు ఉదయం 8 నుండి 9 గంటల వరకు ఆరు నుండి పదవ తరగతి పిల్లలకు ప్రతినిత్యం మొదటి క్లాసు యోగతో ప్రారంభించాలని సూచనలు ఇచ్చారు. యోగ టీచర్లకు కనీసం కొంత రుసుము ఇస్తానని తెలిపారు. స్వామి భాగ్యనగర్ దక్షిణ జిల్లా సీనియర్ యోగ ప్రచారకుడు ఏ ఏ సత్తయ్య యోగ మాస్టర్ తెలిపారు.